ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 7 ఏప్రిల్ 2024



వలంటీర్ల రాజీనామాపై
ఈసీ ఆరా?

- ఇప్పటివరకూ 118 మంది వలంటీర్లు రాజీనామా
- 53 మంది తొలగింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కి అధికార పార్టీతో అంటకాగుతున్న వలంటీర్లపై అధికారులు వేటు వేస్తున్నారు. అదే సమయంలో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, బెదిరింపులతో మరికొందరు వలంటీర్లు రాజీనామా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజీనామా చేసిన/తొలగించిన వలంటీర్ల గురించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా ఆరా తీసినట్టు తెలిసింది. శనివారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వలంటీర్ల రాజీనామా/తొలగింపులపై చర్చ జరిగినట్టు తెలిసింది. రాజీనామా చేసిన/నిబంధనలు అతిక్రమించి నందుకు తొలగించిన వలంటీర్ల వివరాలు పంపాల్సిందిగా మీనా కోరినట్టు సమాచారం. విశాఖ జిల్లాలో ఇప్పటివరకు 118 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మరో

... మిగతా 6వ పేజీలో

ఏడుగురు వలంటీర్లపై కేసులు

జ్ఞానాపురం, ఏప్రిల్ 6: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఓ రాజకీయ పార్టీ నిర్వహించిన సమావేశానికి హాజరైన ఏడుగురు వలంటీర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు పోలీసు కేసులు నమోదు చేసినట్టు జోన్-5 జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ 56వ వార్డు పరిధిలోని 314, 315, 316 సచివాలయాల్లో వలంటీర్లుగా పనిచేస్తున్న ఎలగడ పూజిత, దొంతంశెట్టి పూర్ణ, కాళ్ల రేవతి, పెంటకోట నాగమణి, మల్ల రేవతి, నాగులాపల్లి మీనా, దాడి వెంకటలక్ష్మిలపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాలకు హాజరవడం, వారి తరఫున ప్రచారం చేయడం నేరమన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

57 మంది వలంటీర్లు రాజీనామా

పద్మనాభం, ఏప్రిల్ 6: మండలంలోని పలు సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖలను ఎంపీడీఓ శైలజకు అందజేశారు. పద్మనాభం, మద్ది, రెడ్డిపల్లి సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 57 మంది వలంటీర్లు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు పేర్కొంటూ ప్రతిఒక్కరూ వ్యక్తిగతంగా తమ రాజీనామా లేఖలను ఎంపీడీఓకు ఇచ్చారు.

మద్యనిషేధంపై మాట తప్పి, మడమ తిప్పి...

సంవత్సరం	అమ్ముడైన మద్యం విలువ (రూ.కోట్లలో)
2019-20	రూ.767.92 కోట్లు
2022-23	రూ.1952.33 కోట్లు
2023-24	రూ.2061.30 కోట్లు





మూడు దశల్లో సంపూర్ణ మద్య నిషేధం విధిస్తానని 2019 ఎన్నికల సమయంలో జగన్ హామీ


మద్యాన్ని పూర్తిగా నిషేధించిన తర్వాతే 2024 ఎన్నికల్లో ఓటు అడుగుతానని ప్రగల్భాలు

- అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయం విస్మరించిన జగన్
- ఆదాయం రాబట్టుకోవడమే ధ్యేయంగా మద్యం ధరలు పెంపు
- విశాఖ జిల్లాలో గత ఐదేళ్లలో రెండు రెట్లు పెరిగిన ఆదాయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"ప్రతి అక్కచెల్లెమ్మకు ఒకటే చెబుతున్నా. ఎన్నికలు పూర్తయిపోయిన తర్వాత ఐదేళ్లకు (2024లో) మళ్లీ జరిగే ఎన్నికల నాటికి మద్యాన్ని పూర్తిగా తీసేసిన తర్వాతే మీ దగ్గరకు వచ్చి ఓట్లు అడుగుతానని చెబుతున్నా. మద్యం మీద పూర్తిగా మూడు దశలుగా యుద్ధం ప్రకటిస్తాను. మొదట దశలో మద్యాన్ని తగ్గించే దిశగా అడుగులు వేస్తాం. రెండో దశలో ధరలు పెంచడం, మద్యం వల్ల జరిగే హానిపై అవగాహన కల్పిస్తాం. ఒకేసారి మద్యం తీసేస్తే పూర్తిగా బానిసలైన వారంతా ఇబ్బందిపడి బతకలేని పరిస్థితి వస్తుంది కాబట్టి వారికోసం ప్రతి నియోజకవర్గంలో ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా రిహాబిలేటేషన్ సెంటర్ ఏర్పాటుచేస్తాం. మూడో దశకు వచ్చేసరికి పూర్తిగా మద్యం లేకుండా చేస్తానని హామీ ఇస్తున్నాను. మద్యం స్టార్ హోటళ్లకు మాత్రమే పరిమితమయ్యేలా నిషేధం విధిస్తాం. ధనవంతులు తప్ప పేద, మధ్య తరగతి వారికి మద్యం అందుబాటులో లేకుండా ఉండే పరిస్థితి తెస్తాం.'

...ఇదీ 2019 ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగం.



జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఐదేళ్లు గడిచిపోయాయి. 2024 ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఎవరికి వారు ప్రచారం ముమ్మరం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి కూడా తన పార్టీ అభ్యర్థులకు ఓటెయ్యాలంటూ ప్రచారం చేస్తున్నారు. కానీ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన సంపూర్ణ మద్య నిషేధం హామీ గురించి మాత్రం ఎక్కడా ప్రస్తావించడం లేదు.

ఐదేళ్లలో దశల వారీగా నిషేధం అమలు చేసి పేద, మధ్యతరగతి వారికి మద్యం అందుబాటులో లేకుండా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కానీ, గత ఐదేళ్ల జగన్ పాలనలో విశాఖ జిల్లాలో మద్యం ద్వారా ఆదాయం దాదాపు రెండు రెట్లు పెరిగింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 2019 నాటికి 397 మద్యం దుకాణాలు, 124 బార్‌లు ఉండేవి. వీటికి ఆనందపురం, గోపాలపట్నంలోని జెర్రిపోతుల పాలెంతోపాటు అనకాపల్లిలో ఉన్న డిపోల నుంచి మద్యం సరఫరా అయ్యేది. జిల్లాల పునర్విభజన తర్వాత అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు అనకాపల్లి డిపో నుంచి, విశాఖ జిల్లాలోని దుకాణాలు,

... మిగతా 6వ పేజీలో

ఓషన్ డెక్ ఎక్కడ?

- వుడా పార్కు వెనుక రూ.7.8 కోట్లతో నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ ప్రతిపాదన
- 9 నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడి
- ఇప్పటివరకూ కనీసం శంకుస్థాపన కూడా చేయని వైనం


ఓషన్ డెక్ నమూనా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పర్యాటక ప్రాజెక్టులను పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ఆర్భాటంగా ప్రకటనలు చేయడం తప్పితే వాటిని సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవడంపై పెద్దగా దృష్టిపెట్టడం లేదు. పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో ఎవరు ఏమి చేస్తున్నారో సమీక్షించే వారు లేకుండా పోయారు.

గత ఏడాది జూలైలో 'ఓషన్ డెక్' ప్రాజెక్టును ప్రకటించారు. ఆర్‌కే బీచ్‌లో వుడా పార్కు వెనుకనున్న పాత లైట్ హౌస్ స్థలంలో దీనిని నిర్మిస్తామని అధికారులు వెల్లడించారు. పర్యాటకులను ఆకర్షించేలా ఈ ప్రాజెక్టు నిర్మాణం ఉంటుందన్నారు. ఇక్కడి సముద్రంలో రాళ్లు ఉండడంతో వాటిని ఉపయోగించుకొని తీరాన 50 మీటర్ల పొడవు, సముద్రంలో మరో 50 మీటర్ల పొడవున మొత్తం 100 మీటర్ల డెక్ ఒకటి నిర్మించనున్నామని చెప్పారు. 'గ్రౌండ్+వన్' ఫ్లోర్ భవనంలా వస్తుందన్నారు. డెక్ నుంచి సముద్రం లోపలకు నడుచుకుంటూ వెళితే...అక్కడ 60 మంది కూర్చునేలా రెస్టారెంట్ నిర్మిస్తామన్నారు. పై ఫ్లోర్‌ను వ్యూ పాయింట్‌గా ఉంచి, సందర్శకులు పైకి వెళ్లి సముద్రం, పరిసర ప్రాంతాలను చూసే అవకాశం కల్పిస్తామన్నారు. వీలైతే 'టేక్ ఎవే' విధానంలో రెస్టారెంట్ నుంచి ఫుడ్ తీసుకువెళ్లి...అక్కడే తినేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.7.8 కోట్లు వ్యయం అవుతుందని, డిజైన్లు కూడా తయారుచేసినట్టు అప్పటి చీఫ్ ఇంజనీర్ శివప్రసాదరాజు తెలిపారు. దీనిని తొమ్మిది నెలల్లో పూర్తిచేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇప్పటికి ఎనిమిది నెలలు పూర్తయింది. ఇది తొమ్మిదో నెల. అక్కడ చూస్తే ఆ ప్రాజెక్టుకు కనీసం శంకుస్థాపన కూడా చేయలేదు. ఇక్కడకు సమీపంలోనే కురుసుర వద్ద ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ఎత్తిపోయింది. తీరం కోతకు గురవుతూ, బలమైన అలలు వచ్చే చోట ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఏర్పాటుచేయడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఆ ఫ్లోటింగ్ బ్రిడ్జిపైకి ఒక్కరోజు కూడా సందర్శకులను అనుమతించకుండానే దానిని పక్కనపెట్టాల్సి వచ్చింది. వీఎంఆర్‌డీఏలో ప్రాజెక్టు పేరుతో ప్రత్యేకంగా అధికారి ఉన్నా వాటిని సవ్యంగా సమీక్షించకపోవడం, ఇన్‌చార్జి కమిషనర్ అయిన కలెక్టర్ జిల్లా పాలనపై దృష్టిపెట్టి వీఎంఆర్‌డీఏను దిగువ స్థాయి అధికారులకు వదిలిపెట్టడంతో ప్రాజెక్టులు ఏవీ అనుకున్న సమయానికి ప్రారంభం కావడం లేదు.

కొంపముంచుతున్న సిలిండర్లు

ప్రమాదమని తెలిసీ బోట్లలో వాటితోనే వంట

- తాజాగా మరో ఘటన
- తీవ్రంగా గాయపడిన మత్స్యకారులు
- నాలుగు నెలల క్రితం ఫిషింగ్ హార్బర్‌లో పెను నష్టం వాటిల్లడానికి సిలిండర్లు పేలడమే కారణం
- ప్రత్యామ్నాయం చూడాల్సిందిగా పోలీస్ కమిషనర్ చేసిన సూచనను పట్టించుకోని వైనం


బోటు నుంచి వస్తున్న మంటలు (ఫైల్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు తమ వెంట ప్రమాదాన్ని కూడా తీసుకువెళుతున్నారు. ప్రాణాలకు ముప్పు అని తెలిసినా ప్రత్యామ్నాయం చూసుకోవడం లేదు. సముద్రంలో ఉన్నన్ని రోజులు వంట కోసం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లనే ఉపయోగిస్తున్నారు. అవే ఒక్కొక్కసారి వారిని తీవ్ర ప్రమాదంలోకి నెడుతున్నాయి.

కాకినాడకు చెందిన భవానీ అనే బోటు విశాఖ తీరానికి 30 నాటికల్ మైళ్ల దూరంలో శుక్రవారం ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. మొత్తం తొమ్మిది మంది మత్స్యకారులు గత నెల 26న వేటకు బయలుదేరారు. ఈ నెల 14వ తేదీ వరకు సముద్రంలోనే ఉండాలని డీజిల్, వంట సరకులు, గ్యాస్ సిలిండర్లు తీసుకువెళ్లారు. జనరేటర్‌లో సమస్య ఏర్పడి మంటలు వ్యాపించాయని మత్స్యకారులు చెబుతుండగా, వారిని కాపాడిన కోస్టుగార్డు సిబ్బంది మాత్రం గ్యాస్ సిలిండర్ పేలడం వల్ల ప్రమాదం జరిగిందని అంటున్నారు. వీరిని కింగ్ జార్జి ఆస్పత్రికి తీసుకురాగా 50 శాతానికిపైగా గాయాలైన ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

వద్దని చెబుతున్నా...

నాలుగు నెలల క్రితం ఫిషింగ్ హార్బర్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. ఆకతాయిలు సిగరెట్ కాల్చి, ఆర్పకుండా బోటుపైకి విసిరేయడంతో వలలు అంటుకొని మంటలు చెలరేగాయి. సముద్రం వైపు నుంచి గాలులు బలంగా వీయడంతో ఆ మంటలు పక్కనున్న బోట్లకు అంటుకున్నాయి. పలు బోట్లలో గ్యాస్ సిలిండర్లు ఉండడంతో అవి పేలి ప్రమాదం పెద్దదైంది. 36బోట్లు కాలిపోయి నీటిలో మునిగిపోయాయి. మరో 19 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈసందర్భంగా జరిగిన విచారణలో ప్రమాదం పెద్దది కావడానికి

... మిగతా 6వ పేజీలో

అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయల సాగు

- 'పోషణ వాటిక' పేరుతో రూ.పది వేలు మంజూరుచేసిన కేంద్రం
- తొలి విడతగా జిల్లాలోని 42 కేంద్రాలకు విడుదల
- ఇంకుడు గుంతలు కూడా తవ్వకం

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో కాయగూరల మొక్కల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. 'పోషణ వాటిక' పేరుతో ఒక్కో కేంద్రానికి పది వేల రూపాయల చొప్పున విడుదల చేసింది. సొంత స్థలంలో భవనం ఉండడంతోపాటు కొంత ఖాళీ ప్రదేశం ఉన్న కేంద్రాలకు ఈ నిధులను ఇస్తుంది. జిల్లాలో మొత్తం 777 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, వీటిలో 190 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. తొలి దశలో 42 కేంద్రాలకు పది వేలు చొప్పున కూరగాయల మొక్కల పెంపకానికి కేంద్రం నిధులను మంజూరుచేసింది. రెండో విడత మరికొన్ని కేంద్రాలకు విడుదల చేయనుందని అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తంతో కేంద్రం పరిధిలో కాయగూరలు పండించనున్నారు. వీటిని అదే కేంద్రాల్లో వంటకు వినియోగించనున్నారు. వీటి నిర్వహణ బాధ్యతను పూర్తిగా ఆయాలు చూడనున్నారు. ఇప్పటికే కేంద్రాల్లోని సిబ్బందికి నిధులు అందించినట్టు అధికారులు చెబుతున్నారు. వంగ, బెండ వంటి మొక్కల పెంపకంతోపాటు తోటకూర, గోంగూర వంటివి పండించనున్నారు.

ఇంకుడు గుంతలకు నిధులు

వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు కూడా నిధులు మంజూరుచేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో కేంద్రానికి రూ.300 చొప్పున ఇవ్వనున్నారు. జిల్లాలోని 777 కేంద్రాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయనున్నారు. ఈ గుంతలు తవ్వే బాధ్యతను ఆర్‌డబ్ల్యుఎస్‌కు అప్పగిస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖకు సమాచారాన్ని అందించారు. నిధులను కూడా నేరుగా వారికే బదలాయించనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

మధురవాడలో వైసీపీ నేత దందా

- నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్థు నిర్మాణం

ఆగని అక్రమ నిర్మాణం

- బక్కన్నపాలెం రహదారి విస్తరణ కోసం జీవీఎంసీ సేకరించిన స్థలంలో ఇప్పుడు పనులు
- అప్పట్లోనే టీడీఆర్ కూడా జారీ
- గతంలో ఒకసారి పనులు ప్రారంభం
- 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో స్పందించి నిలిపివేయించిన చీఫ్ సిటీ ప్లానర్
- ప్రస్తుతం అధికారులు ఎన్నికల బిజీలో ఉండడంతో మళ్లీ నిర్మాణం మొదలు


మధురవాడలో చుట్టూ పరదాలు కట్టి లోపల అక్రమ నిర్మాణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అధికారులంతా ఎన్నికల హడావుడిలో ఉన్నారు. ఇదే అదనుగా నగరంలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. నిబంధనలకు విరుద్ధమని గతంలో అధికారులు నిలిపివేసిన నిర్మాణాలు తిరిగి ప్రారంభమైపోతున్నాయి. జీవీఎంసీ జోన్-2 (మధురవాడ) పరిధిలో అధికార పార్టీకి చెందిన చోటా నేత కూడా తన అక్రమ భవన నిర్మాణాన్ని పూర్తిచేసే పనిలో పడ్డారు. గతంలో జీవీఎంసీ అధికారులు అడ్డుకోవడంతో పనులు నిలిపివేశారు. తాజాగా మళ్లీ పనులు ప్రారంభించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. దీనిపై స్థానికులు జోన్-2 ఏసీపీకి ఫిర్యాదు చేసినా చూస్తామన్నారే తప్ప ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు.

మధురవాడలో జాతీయ రహదారి నుంచి బక్కన్నపాలెం నవోదయ స్కూల్ వరకూ ప్రస్తుతం 40 అడుగులు రోడ్డు ఉంది. దీన్ని భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 80 అడుగులకు విస్తరించాలని వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచింది. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు 2023 ప్రారంభంలోనే సర్వే చేసి, రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) రూపొందించారు. రోడ్డు విస్తరించేందుకు బక్కన్నపాలెం రోడ్డు కార్నర్‌లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో కొంతభాగం తొలగించాల్సి ఉంది. ఆ భవనంలో దాదాపు 156 చదరపు మీటర్ల స్థలం రోడ్డు విస్తరణకు సేకరించాలని పేర్కొంటూ సర్వేఅధికారులు మార్కింగ్ చేశారు. మార్కింగ్ చేసిన మేర భవనాన్ని తొలగించి జీవీఎంసీకి దఖలు పరచాలంటూ భవన యజమానికి టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేశారు. స్వాధీనం చేసుకున్న

... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.15
సహరి (సోమ)	4.30

అసలేం జరిగింది

- చైతన్య ఇంజనీరింగ్/డిప్లొమా కాలేజీ విద్యార్థిని ఆత్మహత్యపై సర్వత్రా చర్చ
- ల్యాబ్ టెక్నీషియన్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్టు మూడు నెలల కిందటే ప్రిన్సిపాల్‌కు మౌఖికంగా ఫిర్యాదు
- అయినా పట్టించుకోని వైనం... దాంతో మరింత శ్రుతిమించిన వ్యవహారం
- ఈ క్రమంలోనే బలవన్మరణం
- ల్యాబ్ టెక్నీషియన్ ఏదో కారణంతో తమను తాకుతుంటారని చీటీల ద్వారా పోలీసుల దృష్టికి తీసుకువెళ్లిన విద్యార్థినులు


హాస్టల్ భవనం

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లమో విద్యార్థిని ఆత్మహత్యకు కారకులెవరనే చర్చ జరుగుతోంది. కాలేజీ యాజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఆమె ప్రాణాలు కోల్పోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్న అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన 16 ఏళ్ల బాలిక గత నెల 28వ తేదీన కళాశాల హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ నూనెల శంకరరావు తనపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు శరీరాన్ని తాకుతున్నాడంటూ మూడు నెలల కిందట ప్రిన్సిపాల్ వద్దకు వెళ్లి ఆమె మౌఖికంగా ఫిర్యాదు చేసింది. కానీ బాలిక ఫిర్యాదును ప్రిన్సిపాల్ సీరియస్‌గా తీసుకోకపోవడంతో శంకరరావు ఆగడాలపై ఫిర్యాదు చేసేందుకు విద్యార్థినులు వెనుకాడారు. తాము ఫిర్యాదు చేసినా ఫ్యాకల్టీ అంతా ఒకటే అనే భావన అందరికీ కలిగింది. మరోవైపు శంకరరావు ఆగడాలు శ్రుతిమించాయి. ఈ విషయం తల్లిదండ్రులకు చెబితే చదువు మానేసి ఇంటికి

... మిగతా 6వ పేజీలో

నేడు పవన్‌కల్యాణ్ అనకాపల్లి రాక

- పట్టణ వీధుల్లో రోడ్డు షో
- సాయంత్రం 4 గంటలకు నెహ్రూ చౌక్‌లో సభ



అనకాపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం అనకాపల్లి రానున్నారు. సాయంత్రం 3.30 గంటలకు హెలికాప్టర్‌లో అనకాపల్లి డైట్ కళాశాల సమీపంలో గల ఒక ప్రైవేటు లేఅవుట్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి రింగ్‌రోడ్డులో గల ఎన్టీఆర్ విగ్రహం కూడలి, చేపలబజారు, చిన్న నాలుగురోడ్ల కూడలి, కన్యకాపరమేశ్వరి జంక్షన్, వేల్పుల వీధి మీదుగా నెహ్రూచౌక్ జంక్షన్ వరకూ వారాహి వాహనంలో రోడ్డుషో నిర్వహిస్తారు. నాలుగు గంటలకు నెహ్రూచౌక్ కూడలిలో వారాహి వాహనం మీద నుంచి ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

'మంచి నేతలను ఎన్నుకోవాలి'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 6: ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే విశాఖ అభివృద్ధికి కృషి చేసే నేతలకే రాజకీయ పార్టీలు టికెట్ ఇవ్వాలని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు రాజుగౌడ్ కోరారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు విశాఖకు తెచ్చే సత్తా ఉన్నవారికే ఎంపీ టికెట్ కేటాయించాలన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే నాయకులను గుర్తించి ఎన్నుకోవాలన్నారు. విశాఖపట్నం కాలుష్య కోరల్లో చిక్కుకుందని దీనిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ కృషి చేసే వారికి అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో దక్షిణ సయ్యద్ ముస్తఫా, రాజ్‌కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

'వేధింపుల నుంచి రక్షణ కల్పించండి'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 6: సోషల్ మీడియా ద్వారా పరిచయమైన దేవేజు శరత్‌బాబు తనను మానసికంగా భయభ్రాంతులకు గురి చేసి, వేధిస్తున్నారని చినముషిడివాడకుచెందిన విజ్ఞాన రమాదేవి వాపోయారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏళ్ల కిందటే శరత్ తనకు సోషల్ మీడియా ద్వారా పరిచయమ్యారని, అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదన్నారు. ఉన్నతాధికారులు తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

మహారాణిపేట ఏప్రిల్ 5: పాఠశాలకు వెళ్లిన బాలుడు కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు, మహారాణిపేటలోని సెయింట్ ఆంథొని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు బలగా ప్రశాంత్ (15) శనివారం పాఠశాలకు వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి: శ్రీభరత్



పూర్ణామార్కెట్‌లో ర్యాలీ చేస్తున్న శ్రీభరత్, గండి బాబ్జీ, వంశీకృష్ణ

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 6: రాష్ట్ర పురోభివృద్ధికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విశాఖ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 35వ వార్డులో శనివారం రాత్రి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణతో కలసి వాడవాడలా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల ప్రజలనుద్దేశించి మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమయిందన్నారు. బలహీన వర్గాలను జగన్ దగా చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, గంగాడ గోవింద్, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి.

రాష్ట్రంలో కొత్త ట్యాక్స్ అమలవుతోంది

» జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

సీతమ్మధార, ఏప్రిల్ 6: రాష్ట్రంలో సరికొత్త ట్యాక్స్ అమలవుతోందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే వైసీపీ అభ్యర్థులు ప్రజలు, వ్యాపారుల నుంచి బలవంతంగా సొమ్ము వసూలుచేస్తున్నారన్నారు. ఇటీవల చోడవరంలో జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ అన్నారు. వైసీపీ అభ్యర్థులు వ్యాపారులను బెదిరించి రూ.కోట్లలో దోచుకుంటున్నారన్నారు. ఆ డబ్బు ఎన్నికల్లో పంపిణీ చేస్తారన్నారు. కూటమి అభ్యర్థులపై ఫేక్ కేసులు బనాయించి, నామినేషన్ వేయకుండా పెద్ద కుట్ర పన్నుతున్నారన్నారు. చోడవరంలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై కేసు బనాయించడం ఇందులో భాగమేనన్నారు. బొత్స స్థానికత కోసం మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ, బీజేవైఎం నాయకులు బైరెడ్డి పోతన్నరెడ్డి, కోరాడ సాయి సుదర్శన్, కాళ్ళ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు నివారిస్తున్నాం: ఈఈ

మాధవధార, ఏప్రిల్ 6: ఈపీడీసీఎల్ జోన్-2 ఆపరేషన్స్ డివిజన్ పరిధిలోని మాధవధార ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధి ప్రాంతాలకు విద్యుత్ కష్టాలు ఎదురవకుండా చర్యలు తీసుకుంటున్నట్టు జోన్-2 ఈఈ బీకేనాయుడు తెలిపారు. ఈనెల 3వ తేదీ గురువారం కూడా సింహాచలం 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఎన్ఎస్‌టీఎల్ మాధవధార సబ్‌స్టేషన్ ఫీడర్ 1 లైన్ ఐసోలేటర్ కొత్తది ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా లైన్ క్లియర్ కోసం సరఫరా నిలిపినట్టు వివరణ ఇచ్చారు. ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ఎదురైన అప్రకటిత విద్యుత్ అంతరాయం పట్ల ఆయన సబ్‌స్టేషన్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రత్యామ్నాయంగా మర్రిపాలెం సబ్‌స్టేషను నుంచి సరఫరా అందించినప్పటికీ అనుకోని అంతరాయం ఏర్పడిందన్నారు. అప్రకటిత కోతలకు తావులేకుండా వేసవిలో నిరంతర సరఫరా అందించే విధంగా నిర్వహణ పరమైన చర్యలు తీసుకుంటున్నామని ఏఈ అప్పలరాజు తెలిపారు. సాంకేతిక సమస్యలు ఏర్పడిన సందర్భంలో మినహా సరఫరా ఆగదన్నారు. వినియోగదారులకు ముందస్తు సమాచారంతోనే సరఫరా నిలిపివేత, నిర్వహణ పనులు చేపడతామని స్పష్టం చేశారు.

మాజీ మంత్రి గంటాను కలిసిన సీఎం రమేశ్



సీఎం రమేశ్‌ను సత్కరించిన గంటా శ్రీనివాసరావు

అనకాపల్లి ఎంపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్, విశాఖపట్నంలోని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును శనివారం కలిశారు. ఆయన ఇంటికి వచ్చి మాట్లాడారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

కనకమహాలక్ష్మికి సహస్ర తులసి దళార్చన



తులసి దళాల మధ్య కనకమహాలక్ష్మి

జగదాంబ కూడలి, ఏప్రిల్ 6: వన్‌టౌన్ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు. ప్రతి శనివారం జరిగే ఈ కార్యక్రమంలో ఉభయదాతలతో అర్చకులు పూజలు జరిపిస్తారు. అమ్మవారి విగ్రహాన్ని తులసిదళాలతో అలంకరించి రూ.1,500 టికెట్ తీసుకున్న దంపతులతో వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ సహస్ర తులసీ దళార్చన చేయించారు. పూజానంతరం ఉభయదాతలకు తీర్థ ప్రసాదాలు, అమ్మవారి కుంకుమ అందజేశారు. ఈవో పి.శ్రీనివాసులురెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీకి వెల్లంకి సర్పంచ్, వార్డు సభ్యుల రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న కాకర వెంకటరమణ

ఆనందపురం, ఏప్రిల్ 6: మండలంలోని వెల్లంకి పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. సీనియర్ నాయకుడు కాకర వెంకటరమణ ఆధ్వర్యంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వార్డు సభ్యులు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కాకర వెంకటరమణ మాట్లాడుతూ టీడీపీలో 35 ఏళ్ల మండల పార్టీ అధ్యక్షుడిగా, యూత్ కమిటీ అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా పని చేశానని, భీమిలిలో సబ్బం హరి ఓటమి తరువాత కార్యకర్తల మనుగడ కోసమే వైసీపీలో చేరామని చెప్పారు. భీమిలి టిక్కెట్ గంటా శ్రీనివాసరావుకు కేటాయించడంతో ఆయనపై అభిమానంతో త్వరలో టీడీపీలో చేరనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు పిన్నింటి అమలా రాంబాబు, కాకర పద్మ, వసి ఆదిలక్ష్మి, పైడిరాజు, అక్కరబోయిన నరసింగరావు, యర్రంశెట్టి అప్పలరాజు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడుకు టీడీపీ నేతల పరామర్శ



కళావతమ్మకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

కంచరపాలెం, ఏప్రిల్ 6: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మాతృమూర్తి ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో జీవీఎంసీ 55వార్డు టీడీపీ నాయకులు శనివారం నిమ్మాడలో అచ్చెన్నాయుడు, సోదరుడు కింజరాపు ప్రభాకర్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ సీనియర్ నేత బింగిరాజు రెడ్డి, తెలుగు యువత అధికార ప్రతినిధి జోగా మహేష్ కుమార్, సీహెచ్ నరేశ్, సింహాచలం తదితరులు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని అచ్చెన్నాయుడు స్వగృహంలో కళావతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

మాధవధారలో పోలీసుల కవాతు

మురళీనగర్, ఏప్రిల్ 6: మాధవధార వాంబే కాలనీ ఎదుట గురువారం రాత్రి జరిగిన కొట్లాటతో సంబంధం లేని వ్యక్తిని దారుణంగా కత్తితో పొడిచి చంపారు. ఉదయ్ అనే నేర ప్రవృత్తి కల్గిన వ్యక్తి స్థానికంగా ఉంటున్న తేజ గొడవలో తనకు అడ్డుపడ్డాడని కత్తితో పొడిచాడు. రెండు రోజులుగా అలజడి సృష్టించిన ఈ హత్యోదంతంతో ఈ ప్రాంతం పోలీసుల అదుపులో ఉంది. శుక్రవారం పోలీసు బలగాలు భారీ ఎత్తున ఆయుధాలతో కవాతు నిర్వహించారు.

సీఎం రమేశ్‌కు నోటీసు జారీ

» విధి నిర్వహణలో అధికారులకు ఆటంకం కలిగించారని అభియోగం

» 9న చోడవరంలో విచారణకు హాజరు కావాలని ఆదేశం

అనకాపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు అనకాపల్లి పోలీసులు శనివారం 41ఏ నోటీసు జారీ చేశారు. చోడవరంలో ఈ నెల 4న ఓ టైల్స్ వ్యాపారి ఇంట్లో రాష్ట్ర జీఎస్‌టీ అధికారులు తనిఖీ చేస్తుండగా, సీఎం రమేశ్ వారిని అడ్డుకొని విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారి ఎస్ఆర్‌కే సోమేశ్ ఫిర్యాదు మేరకు చోడవరం పోలీసులు అదే రోజు కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడ్డుకున్నందుకు ఆయనపై ఐపీసీ 353, 342, 506, 201, 143,149 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అనకాపల్లిలో సీఎం రమేశ్ నివాసానికి వెళ్లి పోలీసులు నోటీసు అందజేశారు. ఈ నెల 9న చోడవరం పోలీస్‌స్టేషన్‌లో జరగబోయే విచారణకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోగా హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పదవికి మచ్చ తెచ్చిన వాసుపల్లిని ఓడించండి

» బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్



ర్యాలీలో మాట్లాడుతున్న సీతంరాజు సుధాకర్, వంశీకృష్ణ శ్రీనివాస్

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 6: విద్యాలయాల్లో మద్యం పంపిణీ చేసి ఎమ్మెల్యే పదవికి మచ్చతెచ్చిన దక్షిణ వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్‌ను ఓడించాలని బ్రాహణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పిలుపునిచ్చారు. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద శనివారం వంశీకృష్ణకు మద్దతుగా జరిగిన భారీ ప్రచారసభలో మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు వాసుపల్లి చిరునమాగా మారారన్నారు. సంక్షేమ పథకాల్లోరూ డోపీడీకి తెరతీశారని ఆరోపించారు. పదేళ్లుగా వాసుపల్లి ప్రజలకు చేసిందేమీలేదన్నారు. జనసేన అభ్యర్థి వంశీకృష్ణ పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ వాసుపల్లి అవినీతి, అక్రమాలకు అండగా నిలిచారని విమర్శించారు. వంశీ కృష్ణ మాట్లాడుతూ తన పట్ల ఇంతంటి ఆదరణ చూపించిన దక్షిణ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు మూడు పార్టీల శ్రేణులు, సీతంరాజు అభిమానులు, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, పూర్ణామార్కెట్ వరసిద్ధి వినాయక వర్తక సంఘం అధ్యక్షుడు గంగాడ గోవింద్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టిపిపి వార్డు అధ్యక్షుడు బొచ్చా రామిరెడ్డి, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసలేం జరిగింది

... 5వ పేజీ తరువాయి

వచ్చేయమంటారు కాబట్టి, వారి కలలను సాకారం చేయకుండా వారి ముందు తిరిగితే జీవితాంతం బాధపెట్టినట్టు అవుతుందని భావించి ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. గత నెల 28న ఉదయం ఎనిమిది గంటలకు కాలేజీ హాస్టల్‌లోని బాత్‌రూమ్‌కు వెళ్లిన బాలిక రాత్రి ఎనిమిది గంటలు వరకూ బయటకు రాకుండా ఉండిపోయింది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనానికి బాలిక రాకపోయినప్పటికీ కనీసం వార్డెన్ పట్టించుకోలేదు. అలాగే తరగతులకు హాజరుకాకపోయినా, ఉదయం నుంచి రాత్రి వరకూ బాలిక ఆచూకీ లేకపోయినా సిబ్బంది అప్రమత్తం కాలేదు. అదేరోజు రాత్రి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు తన తండ్రికి వాట్సాప్‌లో మెసేజ్ పెట్టి, కాలేజీ హాస్టల్ భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై పోలీసులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదుచేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా అనే లోపాలు బయటపడ్డాయి. హాస్టల్ విద్యార్థినులందరూ లైంగిక వేధింపులకు గురవుతున్నట్టు మృతురాలు తన తండ్రికి పంపిన మెసేజ్‌లో పేర్కొనడంతో పోలీసులు ఈ అంశంపై బాలికలను విచారించారు. ఎవరూ నోరు విప్పడానికి ముందుకు రాకపోవడంతో వారందరితో పేర్లు లేకుండా చీటీల రూపంలో ఎవరెవరు లైంగికంగా వేధిస్తున్నారనే దానిపై సమాచారం సేకరించారు. దీనిప్రకారం కెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ శంకరరావు ఏదో కారణంతో తమను తాకుతున్నట్టు విద్యార్థినులు చీటీల్లో రాయడంతో...అతనే ఆ బాలికను కూడా వేధించినట్టు పోలీసులు నిర్ధారించారు. అలాగే శంకరరావు అకృత్యాలపై ప్రిన్సిపాల్ గుల్లిపల్లి బాను ప్రవీణ్‌కు బాలిక మౌఖికంగా ఫిర్యాదుచేసినా, నిర్లక్ష్యం వహించినట్టు పోలీసుల విచారణలో తేలింది. హాస్టల్ మూడో అంతస్తులో వార్డెన్ మాత్రమే ఉండడానికి గదిని కేటాయిస్తే ఆమె భర్త కూడా అందులోనే ఉంటున్నాసరే యాజమాన్యం పట్టించుకోకపోవడాన్ని కూడా పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. అలాగే హాస్టల్‌లో సీసీ కెమెరాలు పనిచేసేలా చూడడం, ఫైర్ సేఫ్టీ, టెర్రస్‌పైకి వెళ్లకుండా గేటు ఏర్పాటుచేసి తాళం వేయాల్సి ఉన్నా వాటిని యాజమాన్యం విస్మరించినట్టు పోలీసులు గుర్తించారు. విద్యార్థిని కనిపించనప్పుడు యాజమాన్యం ఆమెను వెతకడం కోసం 112, డయల్ 100కి గానీ ఫోన్ చేయకపోవడం, తమకు ఫిర్యాదు చేయకపోవడాన్ని కూడా తీవ్రమైన నిర్లక్ష్యంగానే పోలీసులు పరిగణించారు. అదే బాలికను ఉదయం లేదా మధ్యాహ్నం గుర్తించే ప్రయత్నం చేసినా ఆమెను కాపాడేందుకు వీలుండేదని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

ఆగని అక్రమ నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

స్థలానికి పరిహారంగా నాలుగు రెట్లు ఎక్కువగా అంటే సుమారు 623.52 చదరపు మీటర్లు ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్)ను (నంబర్1086/00073/టీడీఆర్/ఎంపీడబ్ల్యూ/2023) 2023 జనవరిలోనే భవన యజమానికి అందజేశారు. దీంతో ఆ స్థలం జీవీఎంసీకి దఖలు పడినట్టే. టీడీఆర్ అందుకున్న తర్వాత టౌన్‌ప్లానింగ్ అధికారులు మార్కింగ్ చేసిన మేరకు యజమానే భవనాన్ని తొలగించి అప్పగించాలి. కానీ అది జరగలేదు. పోనీ జీవీఎంసీ అధికారులైనా స్వాధీనం చేసుకున్నారా?...అంటే అదీ లేదు. భవన యజమాని అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఆపని చేయలేకపోయారు. మధ్యలో ఒకటి, రెండు సార్లు స్థలాన్ని అప్పగించాలని భవన యజమానిని కోరితే... అధికారులను అటు వైపు వెళ్లొద్దంటూ ఆ పార్టీ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ ప్రాంతంలో దుకాణాలకు డిమాండ్ ఉండడం, భారీగా అద్దెలు వస్తుండడంతో అదే భవనంపై అదనంగా మరో అంతస్తు నిర్మించేందుకు యజమాని సిద్ధమయ్యారు. మూడు, నాలుగు నెలల కిందట పనులు ప్రారంభించారు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో పనులను నిలుపు చేయాలని ఆదేశించారు. వారిని భవన యజమాని ఖాతరు చేయకపోవడంతో చీఫ్ సిటీ ప్లానర్ దృష్టికి తీసుకువెళ్లారు. నేరుగా సీసీపీ బి.సురేష్‌కుమార్ భవనం వద్దకు వెళ్లి పనులు నిలుపుదల చేయాల్సిందేనని ఆదేశించారు. అధికారులు, సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించిన యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని జోన్-2 ఏసీపీకి సూచించారు. అధికార పార్టీ పెద్దలు అధికారులను సముదాయించడంతో అక్కడితో ఆగిపోయింది. తాజాగా జీవీఎంసీ అధికారులంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు. ఇదే అదనుగా భావించిన సదరు అధికార పార్టీ చోటా నేత గతంలో నిలిపివేసిన అక్రమ భవనం నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారు. దీనిపై స్థానికులు జోన్-2 ఏసీపీ శాస్త్రికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీనిపై ఏసీపీ శాస్త్రిని వివరణ కోరగా నోటీసు జారీచేశామని, టీడీఆర్ ఇచ్చిన భవనంపై నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వలంటీర్ల రాజీనామాపై ఈసీ ఆరా?

... 5వ పేజీ తరువాయి

53 మంది వలంటీర్లను అధికారులు తొలగించారు. మొత్తం 171 మంది వలంటీర్లు విధులకు దూరమైనట్టు జిల్లా యంత్రాంగం నివేదించింది. కాగా, జిల్లాలో 10,800 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు.

అరిలోవ ప్రాంతంలో పది మంది

ఆరిలోవ : ఆరిలోవలో పది మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు జోన్ టూ అధికారులు తెలిపారు. 13వ సచివాలయంలో యాగంటి నీలవేణి, చొప్ప మదన్ మోహన్, సెలిపరశెట్టి వినయ్ సాగర్, 15వ సచివాయంలో కాళ్ల సంతోష్, రౌతు పరమేష్, బంకపల్లి రమాదేవి, 18వ సచివాలయంలో జడ్డిపిల్లి మణి, 19లో ఉప్పాటి ప్రసాద్, వంశీ, అలుగోలు శివ, సత్యనారాయణ రాజీనామా చేశారు.

మద్య నిషేధంపై మాట తప్పి, మడమ తిప్పి

... 5వ పేజీ తరువాయి

బార్‌లకు ఆనందపురం, జెర్రిపోతులపాలెంలోని డిపోల ద్వారా మద్యం సరఫరా జరుగుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 అక్టోబరు నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకువచ్చింది. ప్రైవేటు మద్యం దుకాణాలను తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వమే విక్రయాలు ప్రారంభించింది. ప్రస్తుతం విశాఖ జిల్లాలో 139 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 124 బార్‌లతోపాటు 15 స్టార్‌హోటళ్లు, క్లబ్బుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

సంపూర్ణ మద్య నిషేధంపై మోసం చేసిన జగన్:

అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు దశల్లో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తానని హామీ ఇచ్చిన జగన్ తర్వాత ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. మొదట మద్యం దుకాణాల సంఖ్యను తగ్గిస్తానని చెప్పిన జగన్ ఆ మేరకు తొలి ఏడాది పాలన పూర్తయిన తర్వాత 20 శాతం దుకాణాలను తగ్గించారు. అయితే ఎక్కడికక్కడ బెల్ట్‌షాపులు పెరిగాయి. దీనివల్ల మద్యం విక్రయాలు తగ్గడానికి బదులు పెరిగాయి. తర్వాత ఏడాది నుంచి మద్యం దుకాణాల సంఖ్యను తగ్గించాలనే విషయాన్ని పూర్తిగా విస్మరించారు. ఐదేళ్ల పాలన పూర్తయి మళ్లీ సాధారణ ఎన్నికలు జరగబోతున్నాయి. కానీ మద్యాన్ని నిషేధించిన తర్వాతే తిరిగి ఓట్లు అడగడానికి వస్తానని చెప్పిన విషయాన్ని ప్రజలు మరిచిపోయారన్నట్టు సీఎం జగన్ వ్యవహరిస్తున్నారు. మద్య నిషేధాన్ని అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

మూడు రెట్లు పెరిగిన విక్రయాలు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో మద్యం విక్రయాలు దాదాపు రెండు రెట్లు పెరిగాయి. జిల్లాలో 2019-20లో రూ.767.92 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగితే, 2022-23 నాటికి రూ.1,952.33 కోట్లకు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,061.3 కోట్లకు పెరిగాయి. అంటే ఐదేళ్లలో రెవెన్యూ దాదాపు రెండింతలు పెరిగింది. పైగా 2019 నాటికి దుకాణాల్లో మద్యం ప్రియులకు కావలసిన బ్రాండ్‌లు అందుబాటులో ఉండేవి. కానీ వైసీపీ హయాంలో ప్రీమియర్ బ్రాండ్లను విక్రయించడం నిలిపివేశారు. వైసీపీ నేతలు, ప్రభుత్వంలోని పెద్దలు, వారి కుటుంబ సభ్యులు, అస్మదీయులకు చెందిన డిస్టిలరీల్లో తయారుచేసిన సొంత బ్రాండ్ మద్యాన్ని మాత్రమే దుకాణాల్లో విక్రయిస్తున్నారు. మందుబాబులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆ బ్రాండ్‌లనే కొనుక్కొని తాగుతున్నారు. వీటి ధర ఎక్కువగా, నాణ్యత తక్కువగా ఉంటుందనే విమర్శలు మందుబాబుల నుంచి వినిపిస్తుంటాయి.

కొంపముంచుతున్న సిలిండర్లు

... 5వ పేజీ తరువాయి

గ్యాస్ సిలిండర్లు కూడా కారణమని పోలీసులు తేల్చారు. దీని తరువాత పోలీస్ కమిషనర్ రవిశంకర్ పోర్టు అధికారులకు పలు సూచనలతో ఒక నివేదిక కూడా ఇచ్చారు. మత్స్యకారులు బోట్లలో గ్యాస్ సిలిండర్లు వాడుతున్నారని, అవి ప్రమాదకరం కాబట్టి, మత్య శాఖతో కలిసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే వేటకు వెళ్లని బోట్లకు డీజిల్ సరఫరా చేయకూడదని కూడా సూచించారు. లంగరు వేసిన బోట్లలో డీజిల్ కూడా ఉండడంతో భారీ ప్రమాదం జరిగిందని ఆయన వెల్లడించారు. అయితే సీపీ చేసిన సూచనను పోర్టు అధికారులు ఎంత వరకు అమలు చేశారో తెలియదు గానీ మత్స్య శాఖ అధికారులు మాత్రం...గ్యాస్ సిలిండర్లు వాడవద్దని హెచ్చరిస్తున్నారు. కానీ ఎవరూ వారి మాటలను ఖాతరు చేయడం లేదు. కాకినాడ మత్స్యకారులకు ఇలాంటి ప్రమాద అనుభవం లేకపోవడంతో వారు మరింత విచ్చలవిడిగా వాడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. చేపల వేటకు వెళ్లే బోట్లలో సిలిండర్లు కాకుండా ప్రత్యామ్నాయం చూసుకుంటే ప్రమాదాలు తగ్గుతాయని మత్స్యకార సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు కూడా వీటిపై హార్బర్‌లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నారు.


చీకటిమయంగా ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్ మెయిన్ రోడ్డు


అంధకారమయంగా 87వ వార్డులోని కాలనీ


86వ వార్డులోని ఓ కాలనీలో మొక్కుబడిగా డిమ్ముగా వెలుగుతున్న ఎల్‌ఈడీ బల్బులు

అంధకారంతో అవస్థలు

పారిశ్రామిక ప్రాంతంలో పలుచోట్ల రాజ్యమేలుతున్న చీకటి

వెలగని వీధి లైట్లతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


71 వార్డులో చీకటితో నిండిన తోకాడ రహదారి

పెదగంట్యాడ, ఏప్రిల్ 6: పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో గాఢాంధకారం రాజ్యమేలుతోంది. అనేక ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రయ్యేసరికి చీకట్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో పెదగంట్యాడ ఫైర్‌స్టేషన్ కూడలి నుంచి కొత్తదిబ్బపాలెం జంక్షన్ వరకు ఉన్న పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు ఏడాది నుంచి నిరాదరణకు గురైంది. ఈ మార్గమంతా రాత్రయ్యేసరికి చిమ్మచీకటిగా మారుతుంది. కిలోమీటరు పొడవునా ఈ రహదారికి ఇరువైపులా విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. అయితే అధికారలుఉ కొన్నింటికి లైట్లు ఏర్పాటు చేశారు. కొన్ని స్తంభాలకు లైట్లు బిగించేందుకు ఏర్పాట్లు చేసి వదిలేశారు. కాగా స్తంభాలకు వేసిన లైట్లు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథులే కరువయ్యారు. దీంతో ఈ ప్రాంతంలో చీకటి రాజ్యమేలుతున్నా జీవీఎంసీ అధికారులు,ప్రజాప్రతినిధులు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు, ఐలా ప్రతినిధులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
దీంతో ఈ రోడ్డులో రాత్రి వేళ ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. పెదగంట్యాడ నుంచి కొత్తదిబ్బపాలెం నిర్వాసిత కాలనీ, యాతపాలెం, వెంకన్నపాలెం, అశోక్‌నగర్, కొంగపాలెం కాలనీలకు రాకపోకలు సాగించేవారంతా ఈ రోడ్డు మీదగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని సుమారు రెండు వందల పరిశ్రమల్లోని వేలాది మంది కార్మికులు కూడా ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులోనే ఓ వే బ్రిడ్జి,కల్యాణమండపం ఉన్నాయి. వే బ్రిడ్జికి వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయి. పరిశ్రమలకు ముడిసరకు తెచ్చేందుకు, ఉత్పత్తులను తీసుకువెళ్లేందుకు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి వేళల్లోనూ ఈ మార్గం భారీ వాహనాలు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులతో రద్దీగా ఉంటుంది. చీకటిమయమైన ఈ రోడ్డులో వాహనాల తాకిడి అధికంగా ఉన్నందున ఎప్పుడు ఈ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భీతిల్లుతున్నారు. అందువల్ల అధికారులు కానీ ఐలా ప్రతినిధులు గానీ మరమ్మతులకు గురైన వీధి లైట్లను బాగు చేయించేందుకు తగిన చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

86, 87 వార్డుల్లో..

ఆటోనగర్: జీవీఎంసీ 86, 87 వార్డుల పరిధిలోని రాజీవ్‌నగర్, రాసాలమ్మ కాలనీ, యాదవ జగ్గరాజుపేట, కణితి, వడ్లపూడి కాలనీల్లో గత కొంతకాలంగా వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు నానాపాట్లు పడుతున్నారు. ఎప్పుడు వెలుగుతాయో.. ఎప్పుడు ఆరి పోతాయో తెలియని ఎల్‌ఈడీ బల్బుల పనితీరుతో కాలనీవాసులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నరు. కొన్ని వీధి లైట్లు నామమాత్రంగా చిన్నపాటి వెలుగుతో డిమ్ముగా వీధుల్లో దర్శనమిస్తున్నాయని, నాణ్యత లేని ఎల్‌ఈడీ బల్బులను వినియోగించడం వల్లే తరచూ ఇవి పాడైపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పనిచేయని లైట్ల సానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు అధికారులు ముందుకు రాకపోవడంతో ఆయా కాలనీల్లో రాత్రయ్యేసరికి చీకటి అలుముకుంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అర్ధరాత్రి విధులు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకునే కార్మికులు కుక్కల బారిన పడుతున్నారు. మరికొంతమంది వాహనదారులు చీకట్లో గోతులను చూసుకోక వాటి మీదగా వాహనాలతో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. పలు ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, పొదలు పేరుకుపోవడంతో పాములు సంచరిస్తున్నాయని, దీంతో రాత్రిళ్లు వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చేందుకు భీతిల్లుతున్నామని స్థానికులు చెబుతున్నారు. దీనికితోడు చిల్లర దొంగల బెడద కూడా అధికంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి తమ కాలనీల్లో విద్యుత్ దీపాలు సజావుగా వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో..

గ్రేటర్ 71వ వార్డు పరిధి ఆటోనగర్, చట్టివానిపాలెం, తోకాడల్లోని పలు కాలనీలలో అంధకారం అలముకుంది. అసలే పెద్దపెద్ద గోతులతో నిండిన ఆయా ప్రాంతాల్లో రాత్రిపూట రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు హడలెత్తిపోతున్నారు. మరోవైపు రోడ్డుపైనే కుక్కలు, పందులు తిష్ట వేస్తుండడంతో వాహనదారులు రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు పారిశ్రామికవేత్తలు ఏపీఐఐసీ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.


ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ ప్లాంట్ నాయకులు

ఉక్కు కార్మికులకు వేతనాలు చెల్లించాలని ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 6: ఉక్కు కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. ఉక్కు కార్మికులకు వేతనాలు చెల్లించాలంటూ శనివారం ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల జీతాల విషయంలో ఉక్కు యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. గత నెలలో రూ.2,500 కోట్ల ఉక్కు ఉత్పత్తుల అమ్మకాలు జరిగాయని, కేవలం రూ.85 కోట్లు మాత్రమే ఉద్యోగుల జీతాలని, అయినా కావాలనే చెల్లించడం లేదని ఆరోపించారు. అధ్యక్షుడు వైటీ దాసు మాట్లాడుతూ కార్మికులను ఇబ్బందులకు గురి చేసే చర్యలను విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాస రాజు, బి.అప్పారావు, భానుమూర్తి, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం

గాజువాక, ఏప్రిల్ 6: దేశంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసింది ఒక్క బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ లక్కరాజు సోంబాబు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ మంచి ఆశయం కోసం, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో బీజేపీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొండా ఎల్లాజీరావు, వి.రోహిణి, తాతారావు, వెంకటరావు, రంజిత్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విశాఖ పార్లమెంటు ఉపాధ్యక్షునిగా పైడిరాజు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఏప్రిల్ 6: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలేనికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘ నాయకుడు నరవ పైడిరాజును టీడీపీ విశాఖ పార్లమెంటు ఉపాధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శనివారం టీడీపీ కార్యాలయంలో 'పశ్చిమ' కూటమి అభ్యర్థి పి.గణబాబు ఆయనకు అందజేశారు. అలాగే తెలుగు యువత కార్యదర్శిగా నమ్మి రవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాస్ చౌదరి, వై.ప్రసాద్, పి.మాణిక్యం, రమణరెడ్డి, అరుణజ్యోతి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ భారతిని సత్కరిస్తున్న అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

అగనంపూడి, ఏప్రిల్ 6: ఇక్కడి ఏరియా ఆస్పత్రిలో శనివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని స్థానిక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అందరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మంచి ఆహారంతో పాటు నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురి కాకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బి.సత్యనారాయణ, ఎం.వెంటరమణ, నరసింహమూర్తి, వైద్యులు ఉష, గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌తో అనేక సమస్యలు

అక్కిరెడ్డిపాలెం: జంక్ ఫుడ్ తినడం వల్ల ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు అధికమవుతున్నాయని ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఆర్వీ రవికన్న అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో నా ఆరోగ్యం-నా హక్కు అనే నినాదంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొన్నారు.



మల్కాపురం ఎస్సీ కాలనీలో ప్రచారంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, తదితరులు. (ఇన్‌సెట్లో) ఓటర్లకు నమస్కారం చేస్తున్న ఆనంద్‌కుమార్

వైసీపీ పాలనలోనే ప్రజలకు మేలు

పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, ఏప్రిల్ 6: వైసీపీ పాలనలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు పరిధిలోని గాంధీజీ వీధి, రెడ్డి వీధి, జాలరవీధి, శెట్టిబలిజీల వీధి, ఎస్సీ కాలనీలలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ముందుగా మూడు నూతుల వద్దనున్న దుర్గాదేవి ఆలయం వద్ద ప్రచారాన్ని ప్రారంభించగా స్థానికులు హారతులిచ్చి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ గత ఎన్నికల సమయంలో ఏ హామీలు ఇచ్చారో వాటన్నింటినీ సుమారు 99 శాతం పూర్తి చేశారని, అందువల్ల ఆయనకు ఓటు అడిగే హక్కు ఉందన్నారు. తాను పశ్చిమ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టాక కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశానన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం ప్రజలతో మాట్లాడి స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వెంటనే ఆయా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, వైఎస్సార్‌టీయూసీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ కలిదండి బద్రీనాథ్, పార్టీ వార్డు అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు (వాసు), తదితరులు పాల్గొన్నారు.

జనతా కాలనీ ఆలయంలో రమాకుమారి పూజలు

ఇక్కడి జనతా కాలనీలోని జయదుర్గ ఆలయంలో ఆడారి ఆనంద్‌కుమార్, సోదరి ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని పలువురు భక్తులను కోరారు. ఆయనను గెలిపిస్తే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తారన్నారు.

'కేంద్ర ప్రభుత్వ కుట్రపూరిత ఆలోచనలను తిప్పికొడతాం'

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 6: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కుట్రపూరిత ఆలోచనలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని ఉక్కు పరిరక్షణ పోరాట నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,150వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగానే ఇక్కడి ఉక్కు యాజమాన్యం వ్యవహరిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను మూసివేయడానికే ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ వస్తున్నారని ఆరోపించారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ దేశ సంపదను కూడబెడుతున్న కార్మిక వర్గం కడుపు కొడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని భూ స్థాపితం చేసే విధంగా పోరాటాను ఉధృతం చేయాలన్నారు. కేంద్రం ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంత వరకు పోరాటాలను ఆపేదే లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం: 'గాజువాక' కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు


..మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 6: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని గాజువాక నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. 88వ వార్డు దువ్వాడ సెక్టార్-1లో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో శనివారం రాత్రి చేపట్టిన ఎన్నికలో ప్రచారంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, బీజేపీ 'గాజువాక' ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు మొల్లి ముత్యాల నాయుడు ప్రసాదుల శ్రీనివాసరావు, ఎస్.పైడిరాజు, యు.శ్రీనివాసరావు, బి.ఎల్లాజీ,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిద్దాం..స్వర్ణాంధ్రను సాధిద్దాం

టీడీపీని గెలిపిద్దాం.. స్వర్ణాంధ్రను సాధిద్దామని ఆ పార్టీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. మాతృశ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాజువాకు అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ గెలుపునకు అందరూ కృషి చేయాలని కోరారు. నాయకులు వేగుంట శ్రీనివాస్, గణపతి, జగదీశ్, రుక్మిణి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

గాజువాక: గాజువాక నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు సమక్షంలో 65వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు సింగంపల్లి దేముడు సుమారు వంద మందితో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గోమాడ వాసు, గంధం వెంకటరావు, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారేట్ 26, దొండకాయలు 18, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 155, బరబటి 22, ముల్లంగి 16,నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 28, దోస కాయలు 12, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22,బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 52, పొటల్స్ 50, కీరదోస 22, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	--	130
ఫారం ధర	--	150
విత్ స్కిన్	--	270
స్కిన్‌లెస్	--	280

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

63వ వార్డులో గణబాబు ప్రచారం


ప్రచారంలో గణబాబు, తదితరులు

సింధియా, ఏప్రిల్ 6: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని జైయాంధ్ర కాలనీ, కాకరలోవ ప్రాంతాల్లో టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు శనివారం ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. తనతో పాటు విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్న, నాయకులు రాజా, జి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు వైసీపీతోనే సాధ్యం'

అగనంపూడి, ఏప్రిల్ 6: సంక్షేమ పథకాలు యథాతథంగా అమలు కావాలంటే వైసీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ గాజువాక అభ్యర్థి, గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 79వ వార్డు పరిధి శనివాడ వేపచెట్టు జంక్షన్‌లో శనివారం ఆయన వైసీపీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచారు. నాయకులు పూర్ణానందశర్మ, శ్రీను, గుర్రం శ్రీను, సమర, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, ఏప్రిల్ 6: జీవీఎంసీ 65వ వార్డు వెంకటాద్రిపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులకు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఉగాది సందర్భంగా ఈ నెల 9న ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా నూకాంబిక ఉత్సవాలు ప్రారంభం

మల్కాపురం, ఏప్రిల్ 6: పారిశ్రామిక ప్రాంతంలో కొత్త అమావ్యాస సందర్భంగా నూకాంబిక ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్దసంఖ్యలో భక్తులు నూకాంబిక ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీహరిపురం, మాజీ సైనికుల కాలనీ, పాత చెక్ పోస్టు ఏరియా, కొత్తనక్కవానిపాలెం, శాంతిగిరి కాలనీ, కోడిపందేలదిబ్బ, జనతాకాలనీ, తెలుగుదేశం కాలనీ, ఏకేసీ కాలనీ, ఇందిరాకాలనీ, తదితర ప్రాంతాల్లో ఉన్న నూకాంబిక ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. మూడు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయి.

'వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు'


జనసేనలో చేరిన వారితో పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి/వేపగుంట, ఏప్రిల్ 6: త్వరలో జరగనున్న ఎన్నికలే వైసీపీకి చివరివి అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. కూటమి ఏర్పాటుతో రాష్ట్ర ముఖచిత్రం మారుతుందన్నారు. ఇక్కడి కూటమి కార్యాలయంలో శనివారం 95వ వార్డుకు చెందిన వైసీపీ నాయకురాలు కల్యాణి ఆధ్వర్యంలో 40 కార్యకర్తలు జనసేనలో చేరారు. కార్యక్రమంలో నాయకులు అయిత సింహాచలం, పిల్లా జగన్మోహనపాత్రుడు, ఆర్.శ్రీనివాసరావు కె.మధు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పంచకర్ల రమేశ్‌బాబు వేపగుంట నుంచి గోశాలకు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉదయం పాదచారులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గొర్లె నాగార్జున, పి.శ్రీహరి, బి.రవికుమార్, బి.సురేశ్, ఎస్.దేముడు, పి.పార్వతి, తదితరులను తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

బోగస్ ఓట్లను తొలగించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా..

పెందుర్తి నియోజవర్గంలోని బోగస్ ఓట్లను తొలిగించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై విచారణ జరపాలంటూ ఈఆర్వో శేష శైలజకు వినతిపత్రాన్ని అందజేశారు. ఒకే డోర్ నంబర్‌తో ఓట్లు పదుల సంఖ్యలో ఉన్నాయని జీరో డోర్ నంబర్‌తో కూడా బోగస్ ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

'విజ్ఞాన్'లో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన

అగనంపూడి, ఏప్రిల్ 6: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఏఏవో కోట రాజశేఖర్, సివిల్ సర్వీస్ ట్రైనర్ ప్రవీణ్‌కుమార్‌లు సివిల్ సర్వీస్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అతిథులను విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, కో-ఆర్డినేటర్ కె.వెంకట నాగరాజు, డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'మంచి నేతలను ఎన్నుకోవాలి'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 6: ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే విశాఖ అభివృద్ధికి కృషి చేసే నేతలకే రాజకీయ పార్టీలు టికెట్ ఇవ్వాలని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు రాజుగౌడ్ కోరారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు విశాఖకు తెచ్చే సత్తా ఉన్నవారికే ఎంపీ టికెట్ కేటాయించాలన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే నాయకులను గుర్తించి ఎన్నుకోవాలన్నారు. విశాఖపట్నం కాలుష్య కోరల్లో చిక్కుకుందని దీనిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ కృషి చేసే వారికి అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో దక్షిణ సయ్యద్ ముస్తఫా, రాజ్‌కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

'వేధింపుల నుంచి రక్షణ కల్పించండి'

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 6: సోషల్ మీడియా ద్వారా పరిచయమైన దేవీజు శరత్‌బాబు తనను మానసికంగా భయభ్రాంతులకు గురి చేసి, వేధిస్తున్నారని చినముషిడివాడకుచెందిన విజ్ఞాన రమాదేవి వాపోయారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏళ్ల కిందటే శరత్ తనకు సోషల్ మీడియా ద్వారా పరిచయమ్యారని, అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదన్నారు. ఉన్నతాధికారులు తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.


బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

మహారాణిపేట ఏప్రిల్ 5: పాఠశాలకు వెళ్లిన బాలుడు కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహారాణిపేటలోని సెయింట్ ఆంథొని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు బలగా ప్రశాంత్ (15) శనివారం పాఠశాలకు వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.









కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి: శ్రీభరత్

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 6: రాష్ట్ర పురోభివృద్ధికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విశాఖ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 35వ వార్డులో శనివారం రాత్రి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణతో కలసి వాడవాడలా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల ప్రజలనుద్దేశించి మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమయిందన్నారు. బలహీన వర్గాలను జగన్ దగా చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, గంగాడ గోవింద్, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి.


పూర్ణామార్కెట్‌లో ర్యాలీ చేస్తున్న శ్రీభరత్, గండి బాబ్జీ, వంశీకృష్ణ

రాష్ట్రంలో కొత్త ట్యాక్స్ అమలవుతోంది

» జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

సీతమ్మధార, ఏప్రిల్ 6: రాష్ట్రంలో సరికొత్త ట్యాక్స్ అమలవుతోందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే వైసీపీ అభ్యర్థులు ప్రజలు, వ్యాపారుల నుంచి బలవంతంగా సొమ్ము వసూలుచేస్తున్నారన్నారు. ఇటీవల చోడవరంలో జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ అన్నారు. వైసీపీ అభ్యర్థులు వ్యాపారులను బెదిరించి రూ.కోట్లలో దోచుకుంటున్నారన్నారు. ఆ డబ్బు ఎన్నికల్లో పంపిణీ చేస్తారన్నారు. కూటమి అభ్యర్థులపై ఫేక్ కేసులు బనాయించి, నామినేషన్ వేయకుండా పెద్ద కుట్ర పన్నుతున్నారన్నారు. చోడవరంలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై కేసు బనాయించడం ఇందులో భాగమేనన్నారు. బొత్స స్థానికత కోసం మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ, బీజేవైఎం నాయకులు బైరెడ్డి పోతన్నరెడ్డి, కోరాడ సాయి సుదర్శన్, కాళ్ల అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు నివారిస్తున్నాం: ఈఈ

మాధవధార, ఏప్రిల్ 6: ఈపీడీసీఎల్ జోన్-2 ఆపరేషన్స్ డివిజన్ పరిధిలోని మాధవధార ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధి ప్రాంతాలకు విద్యుత్ కష్టాలు ఎదురవకుండా చర్యలు తీసుకుంటున్నట్టు జోన్-2 ఈఈ టీకేనాయుడు తెలిపారు. ఈనెల 3వ తేదీ గురువారం కూడా సింహాచలం 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఎన్ఎస్‌టీఎల్ మాధవధార సబ్‌స్టేషన్ ఫీడర్ 1 లైన్ ఐసోలేటర్ కొత్తది ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా లైన్ క్లియర్ కోసం సరఫరా నిలిపినట్టు వివరణ ఇచ్చారు. ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ఎదురైన అప్రకటిత విద్యుత్ అంతరాయం పట్ల ఆయన సబ్‌స్టేషన్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రత్యామ్నాయంగా మర్రిపాలెం సబ్‌స్టేషను నుంచి సరఫరా అందించినప్పటికీ అనుకోని అంతరాయం ఏర్పడిందన్నారు. అప్రకటిత కోతలకు తావులేకుండా వేసవిలో నిరంతర సరఫరా అందించే విధంగా నిర్వహణ పరమైన చర్యలు తీసుకుంటున్నామని ఏఈ అప్పలరాజు తెలిపారు. సాంకేతిక సమస్యలు ఏర్పడిన సందర్భంలో మినహా సరఫరా ఆగదన్నారు. వినియోగదారులకు ముందస్తు సమాచారంతోనే సరఫరా నిలిపివేత, నిర్వహణ పనులు చేపడతామని స్పష్టం చేశారు.

మాజీ మంత్రి గంటాను కలిసిన సీఎం రమేశ్

అనకాపల్లి ఎంపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్, విశాఖపట్నంలోని మాజీ మంత్రి గంటా శ్రీనివాస రావును శనివారం కలిశారు. ఆయన ఇంటికి వచ్చి మాట్లాడారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


సీఎం రమేశ్‌ను సత్కరించిన గంటా శ్రీనివాసరావు

కనకమహాలక్ష్మికి సహస్ర తులసి దళార్చన

జగదాంబ కూడలి, ఏప్రిల్ 6: వన్‌టౌన్ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం సహస్ర తులసి దళార్చన నిర్వహించారు. ప్రతి శనివారం జరిగే ఈ కార్యక్రమంలో ఉభయదాతలతో అర్చకులు పూజలు జరిపిస్తారు. అమ్మవారి విగ్రహాన్ని తులసిదళాలతో అలంకరించి రూ.1,500 టికెట్ తీసుకున్న దంపతులతో వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ సహస్ర తులసీ దళార్చన చేయించారు. పూజానంతరం ఉభయదాతలకు తీర్థ ప్రసాదాలు, అమ్మవారి కుంకుమ అందజేశారు. ఈవో పి.శ్రీనివాసులురెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


తులసి దళాల మధ్య కనకమహాలక్ష్మి

వైసీపీకి వెల్లంకి సర్పంచ్, వార్డు సభ్యుల రాజీనామా

ఆనందపురం, ఏప్రిల్ 6: మండలంలోని వెల్లంకి పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. సీనియర్ నాయకుడు కాకర వెంకటరమణ ఆధ్వర్యంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణ రావు, వార్డు సభ్యులు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కాకర వెంకటరమణ మాట్లాడుతూ టీడీపీలో 35 ఏళ్లు మండల పార్టీ అధ్యక్షుడిగా, యూత్ కమిటీ అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా పని చేశానని, భీమిలిలో సబ్బం హరి ఓటమి తరువాత కార్యకర్తల మనుగడ కోసమే వైసీపీలో చేరామని చెప్పారు. భీమిలి టిక్కెట్ గంటా శ్రీనివాసరావుకు కేటాయించడంతో ఆయనపై అభిమానంతో త్వరలో టీడీపీలో చేరనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు పిన్నింటి అమలా రాంబాబు, కాకర పద్మ, వసి ఆదిలక్ష్మి, పైడిరాజు, అక్కరబోయిన నరసింగరావు, యర్రంశెట్టి అప్పలరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాకర వెంకటరమణ

అచ్చెన్నాయుడుకు టీడీపీ నేతల పరామర్శ

కంచరపాలెం, ఏప్రిల్ 6: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మాతృమూర్తి ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో జీవీఎంసీ 55వార్డు టీడీపీ నాయకులు శనివారం నిమ్మాడలో అచ్చెన్నాయుడు, సోదరుడు కింజరాపు ప్రభాకర్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ సీనియర్ నేత బింగిరాజు రెడ్డి, తెలుగు యువత అధికార ప్రతినిధి జోగా మహేష్ కుమార్, సీహెచ్ నరేశ్, సింహాచలం తదితరులు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని అచ్చెన్నాయుడు స్వగృహంలో కళావతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.


కళావతమ్మకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

మాధవధారలో పోలీసుల కవాతు

మురళీనగర్, ఏప్రిల్ 6: మాధవధార వాంబే కాలనీ ఎదుట గురువారం రాత్రి జరిగిన కొట్లాటతో సంబంధం లేని వ్యక్తిని దారుణంగా కత్తితో పొడిచి చంపారు. ఉదయ్ అనే నేర ప్రవృత్తి కల్గిన వ్యక్తి స్థానికంగా ఉంటున్న తేజ గొడవలో తనకు అడ్డుపడ్డాడని కత్తితో పొడిచాడు. రెండు రోజులుగా అలజడి సృష్టించిన ఈ హత్యోదంతంతో ఈ ప్రాంతం పోలీసుల అదుపులో ఉంది. శుక్రవారం పోలీసు బలగాలు భారీ ఎత్తున ఆయుధాలతో కవాతు నిర్వహించారు.

సీఎం రమేశ్‌కు నోటీసు జారీ

» విధి నిర్వహణలో అధికారులకు ఆటంకం కలిగించారని అభియోగం

» 9న చోడవరంలో విచారణకు హాజరు కావాలని ఆదేశం

అనకాపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు అనకాపల్లి పోలీసులు శనివారం 41ఏ నోటీసు జారీ చేశారు. చోడవరంలో ఈ నెల 4న ఓ టైల్స్ వ్యాపారి ఇంట్లో రాష్ట్ర జీఎస్‌టీ అధికారులు తనిఖీ చేస్తుండగా, సీఎం రమేశ్ వారిని అడ్డుకొని విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారి ఎస్ఆర్‌కే సోమేశ్ ఫిర్యాదు మేరకు చోడవరం పోలీసులు అదే రోజు కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడ్డుకున్నందుకు ఆయనపై ఐపీసీ 353, 342, 506, 201, 143,149 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అనకాపల్లిలో సీఎం రమేశ్ నివాసానికి వెళ్లి పోలీసులు నోటీసు అందజేశారు. ఈ నెల 9న చోడవరం పోలీస్‌స్టేషన్‌లో జరగబోయే విచారణకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోగా హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పదవికి మచ్చ తెచ్చిన వాసుపల్లిని ఓడించండి

» బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 6: విద్యాలయాల్లో మద్యం పంపిణీ చేసి ఎమ్మెల్యే పదవికి మచ్చతెచ్చిన దక్షిణ వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్‌ను ఓడించాలని బ్రాహణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పిలుపునిచ్చారు. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద శనివారం వంశీకృష్ణకు మద్దతుగా జరిగిన భారీ ప్రచారసభలో మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు వాసుపల్లి చిరునమాగా మారారన్నారు. సంక్షేమ పథకాల్లోరూ దోపీడీకి తెరతీశారని ఆరోపించారు. పదేళ్లుగా వాసుపల్లి ప్రజలకు చేసిందేమీలేదన్నారు. జనసేన అభ్యర్థి వంశీకృష్ణ పార్లమెంట్‌అభ్యర్థి శ్రీభరత్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ వాసుపల్లి అవినీతి, అక్రమాలకు అండగా నిలిచారని విమర్శించారు. వంశీ కృష్ణ మాట్లాడుతూ తన పట్ల ఇంతంటి ఆదరణ చూపించిన దక్షిణ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు మూడు పార్టీల శ్రేణులు, సీతంరాజు అభిమానులు, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, పూర్ణామార్కెట్ వరసిద్ధి వినాయక వర్తక సంఘం అధ్యక్షుడు గంగాడ గోవింద్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టిపిపి వార్డు అధ్యక్షుడు బొచ్చా రామిరెడ్డి, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ర్యాలీలో మాట్లాడుతున్న సీతంరాజు సుధాకర్, వంశీకృష్ణ శ్రీనివాస్

అసలేం జరిగింది

... 5వ పేజీ తరువాయి

వచ్చేయమంటారు కాబట్టి, వారి కలలను సాకారం చేయకుండా వారి ముందు తిరిగితే జీవితాంతం బాధపెట్టినట్టు అవుతుందని భావించి ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. గత నెల 28న ఉదయం ఎనిమిది గంటలకు కాలేజీ హాస్టల్‌లోని బాత్‌రూమ్‌కు వెళ్లిన బాలిక రాత్రి ఎనిమిది గంటలు వరకూ బయటకు రాకుండా ఉండిపోయింది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనానికి బాలిక రాకపోయినప్పటికీ కనీసం వార్డెన్ పట్టించుకోలేదు. అలాగే తరగతులకు హాజరుకాకపోయినా, ఉదయం నుంచి రాత్రి వరకూ బాలిక ఆచూకీ లేకపోయినా సిబ్బంది అప్రమత్తం కాలేదు. అదేరోజు రాత్రి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు తన తండ్రికి వాట్సాప్‌లో మెసెజ్ పెట్టి, కాలేజీ హాస్టల్ భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై పోలీసులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదుచేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా అనే లోపాలు బయటపడ్డాయి. హాస్టల్ విద్యార్థినులందరూ లైంగిక వేధింపులకు గురవుతున్నట్టు మృతురాలు తన తండ్రికి పంపిన మెసేజ్‌లో పేర్కొనడంతో పోలీసులు ఈ అంశంపై బాలికలను విచారించారు. ఎవరూ నోరు విప్పడానికి ముందుకు రాకపోవడంతో వారందరితో పేర్లు లేకుండా చీటీల రూపంలో ఎవరెవరు లైంగికంగా వేధిస్తున్నారనే దానిపై సమాచారం సేకరించారు. దీనిప్రకారం కెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ శంకరరావు ఏదో కారణంతో తమను తాకుతున్నట్టు విద్యార్థినులు చీటీల్లో రాయడంతో...అతనే ఆ బాలికను కూడా వేధించినట్టు పోలీసులు నిర్ధారించారు. అలాగే శంకరరావు అకృత్యాలపై ప్రిన్సిపాల్ గుల్లిపల్లి బాను ప్రవీణ్‌కు బాలిక మౌఖికంగా ఫిర్యాదుచేసినా, నిర్లక్ష్యం వహించినట్టు పోలీసుల విచారణలో తేలింది. హాస్టల్ మూడో అంతస్తులో వార్డెన్ మాత్రమే ఉండడానికి గదిని కేటాయిస్తే ఆమె భర్త కూడా అందులోనే ఉంటున్నాసరే యాజమాన్యం పట్టించుకోకపోవడాన్ని కూడా పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. అలాగే హాస్టల్‌లో సీసీ కెమెరాలు పనిచేసేలా చూడడం, ఫైర్ సేఫ్టీ, టెర్రస్‌పైకి వెళ్లకుండా గేటు ఏర్పాటుచేసి తాళం వేయాల్సి ఉన్నా వాటిని యాజమాన్యం విస్మరించినట్టు పోలీసులు గుర్తించారు. విద్యార్థిని కనిపించనప్పుడు యాజమాన్యం ఆమెను వెతకడం కోసం 112, డయల్ 100కి గానీ ఫోన్ చేయకపోవడం, తమకు ఫిర్యాదు చేయకపోవడాన్ని కూడా తీవ్రమైన నిర్లక్ష్యంగానే పోలీసులు పరిగణించారు. అదే బాలికను ఉదయం లేదా మధ్యాహ్నం గుర్తించే ప్రయత్నం చేసినా ఆమెను కాపాడేందుకు వీలుండేదని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

ఆగని అక్రమ నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

స్థలానికి పరిహారంగా నాలుగు రెట్లు ఎక్కువగా అంటే సుమారు 623.52 చదరపు మీటర్లు ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్)ను (నంబర్1086/00073/టీడీఆర్/ఎంవీడబ్ల్యూ/2023) 2023 జనవరిలోనే భవన యజమానికి అందజేశారు. దీంతో ఆ స్థలం జీవీఎంసీకి దఖలు పడినట్టే. టీడీఆర్ అందుకున్న తర్వాత టౌన్‌ప్లానింగ్ అధికారులు మార్కింగ్ చేసిన మేరకు యజమానే భవనాన్ని తొలగించి అప్పగించాలి. కానీ అది జరగలేదు. పోనీ జీవీఎంసీ అధికారులైనా స్వాధీనం చేసుకున్నారా?...అంటే అదీ లేదు. భవన యజమాని అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఆపని చేయలేకపోయారు. మధ్యలో ఒకటి, రెండు సార్లు స్థలాన్ని అప్పగించాలని భవన యజమానిని కోరితే... అధికారులను అటు వైపు వెళ్లొద్దంటూ ఆ పార్టీ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ ప్రాంతంలో దుకాణాలకు డిమాండ్ ఉండడం, భారీగా అద్దెలు వస్తుండడంతో అదే భవనంపై అదనంగా మరో అంతస్తు నిర్మించేందుకు యజమాని సిద్ధమయ్యారు. మూడు, నాలుగు నెలల కిందట పనులు ప్రారంభించారు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో పనులను నిలుపుచేయాలని ఆదేశించారు. వారిని భవన యజమాని ఖాతరు చేయకపోవడంతో చీఫ్ సిటీ ప్లానర్ దృష్టికి తీసుకువెళ్లారు. నేరుగా సీసీపీ బి.సురేష్‌కుమార్ భవనం వద్దకు వెళ్లి పనులు నిలుపుదల చేయాల్సిందేనని ఆదేశించారు. అధికారులు, సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించిన యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని జోన్-2 ఏసీపీకి సూచించారు. అధికార పార్టీ పెద్దలు అధికారులను సముదాయించడంతో అక్కడితో ఆగిపోయింది. తాజాగా జీవీఎంసీ అధికారులంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు. ఇదే అదనుగా భావించిన సదరు అధికార పార్టీ చోటా నేత గతంలో నిలిపివేసిన అక్రమ భవనం నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారు. దీనిపై స్థానికులు జోన్-2 ఏసీపీ శాస్త్రికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీనిపై ఏసీపీ శాస్త్రిని వివరణ కోరగా నోటీసు జారీచేశామని, టీడీఆర్ ఇచ్చిన భవనంపై నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వలంటీర్ల రాజీనామాపై ఈసీ ఆరా?

... 5వ పేజీ తరువాయి

53 మంది వలంటీర్లను అధికారులు తొలగించారు. మొత్తం 171 మంది వలంటీర్లు విధులకు దూరమైనట్టు జిల్లా యంత్రాంగం నివేదించింది. కాగా, జిల్లాలో 10,800 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు.

ఆరిలోవ ప్రాంతంలో పది మంది

ఆరిలోవ : ఆరిలోవలో పది మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు జోన్ టూ అధికారులు తెలిపారు. 13వ సచివాలయంలో యాగంటి నీలవేణి, చొప్ప మదన్ మోహన్, సెలివరశెట్టి వినయ్ సాగర్, 15వ సచివాయంలో కాళ్ల సంతోష్, రౌతు పరమేష్, బంకపల్లి రమాదేవి, 18వ సచివాలయంలో జడ్డిపిల్లి మణి, 19లో ఉప్పాటి ప్రసాద్, వంశీ, అలుగోలు శివ, సత్యనారాయణ రాజీనామా చేశారు.

మద్య నిషేధంపై మాట తప్పి, మడమ తిప్పి

... 5వ పేజీ తరువాయి

బార్‌లకు ఆనందపురం, జెర్రిపోతులపాలెంలోని డిపోల ద్వారా మద్యం సరఫరా జరుగుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 అక్టోబరు నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకువచ్చింది. ప్రైవేటు మద్యం దుకాణాలను తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వమే విక్రయాలు ప్రారంభించింది. ప్రస్తుతం విశాఖ జిల్లాలో 139 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 124 బార్‌లతోపాటు 15 స్టార్‌హోటళ్లు, క్లబ్బుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

సంపూర్ణ మద్య నిషేధంపై మోసం చేసిన జగన్:

అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు దశల్లో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తానని హామీ ఇచ్చిన జగన్ తర్వాత ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. మొదట మద్యం దుకాణాల సంఖ్యను తగ్గిస్తానని చెప్పిన జగన్ ఆ మేరకు తొలి ఏడాది పాలన పూర్తయిన తర్వాత 20 శాతం దుకాణాలను తగ్గించారు. అయితే ఎక్కడికక్కడ బెల్ట్‌షాపులు పెరిగాయి. దీనివల్ల మద్యం విక్రయాలు తగ్గడానికి బదులు పెరిగాయి. తర్వాత ఏడాది నుంచి మద్యం దుకాణాల సంఖ్యను తగ్గించాలనే విషయాన్ని పూర్తిగా విస్మరించారు. ఐదేళ్ల పాలన పూర్తయి మళ్లీ సాధారణ ఎన్నికలు జరగబోతున్నాయి. కానీ మద్యాన్ని నిషేధించిన తర్వాతే తిరిగి ఓట్లు అడగడానికి వస్తానని చెప్పిన విషయాన్ని ప్రజలు మరిచిపోయారన్నట్టు సీఎం జగన్ వ్యవహరిస్తున్నారు. మద్య నిషేధాన్ని అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

మూడు రెట్లు పెరిగిన విక్రయాలు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో మద్యం విక్రయాలు దాదాపు రెండు రెట్లు పెరిగాయి. జిల్లాలో 2019-20లో రూ.767.92 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగితే, 2022-23 నాటికి రూ.1,952.33 కోట్లకు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,061.3 కోట్లకు పెరిగాయి. అంటే ఐదేళ్లలో రెవెన్యూ దాదాపు రెండింతలు పెరిగింది. పైగా 2019 నాటికి దుకాణాల్లో మద్యం ప్రియులకు కావలసిన బ్రాండ్‌లు అందుబాటులో ఉండేవి. కానీ వైసీపీ హయాంలో ప్రీమియర్ బ్రాండ్లను విక్రయించడం నిలిపివేశారు. వైసీపీ నేతలు, ప్రభుత్వంలోని పెద్దలు, వారి కుటుంబ సభ్యులు, అస్మదీయులకు చెందిన డిస్టిలరీల్లో తయారుచేసిన సొంత బ్రాండ్ మద్యాన్ని మాత్రమే దుకాణాల్లో విక్రయిస్తున్నారు. మందుబాబులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆ బ్రాండ్‌లనే కొనుక్కొని తాగుతున్నారు. వీటి ధర ఎక్కువగా, నాణ్యత తక్కువగా ఉంటుందనే విమర్శలు మందుబాబుల నుంచి వినిపిస్తుంటాయి.

కొంపముంచుతున్న సిలిండర్లు

... 5వ పేజీ తరువాయి

గ్యాస్ సిలిండర్లు కూడా కారణమని పోలీసులు తేల్చారు. దీని తరువాత పోలీస్ కమిషనర్ రవిశంకర్ పోర్టు అధికారులకు పలు సూచనలతో ఒక నివేదిక కూడా ఇచ్చారు. మత్స్యకారులు బోట్లలో గ్యాస్ సిలిండర్లు వాడుతున్నారని, అవి ప్రమాదకరం కాబట్టి, మత్స్య శాఖతో కలిసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే వేటకు వెళ్లని బోట్లకు డీజిల్ సరఫరా చేయకూడదని కూడా సూచించారు. లంగరు వేసిన బోట్లలో డీజిల్ కూడా ఉండడంతో భారీ ప్రమాదం జరిగిందని ఆయన వెల్లడించారు. అయితే సీపీ చేసిన సూచనను పోర్టు అధికారులు ఎంత వరకు అమలు చేశారో తెలియదు గానీ మత్స్య శాఖ అధికారులు మాత్రం...గ్యాస్ సిలిండర్లు వాడవద్దని హెచ్చరిస్తున్నారు. కానీ ఎవరూ వారి మాటలను ఖాతరు చేయడం లేదు. కాకినాడ మత్స్యకారులకు ఇలాంటి ప్రమాద అనుభవం లేకపోవడంతో వారు మరింత విచ్చలవిడిగా వాడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. చేపల వేటకు వెళ్లే బోట్లలో సిలిండర్లు కాకుండా ప్రత్యామ్నాయం చూసుకుంటే ప్రమాదాలు తగ్గుతాయని మత్స్యకార సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు కూడా వీటిపై హార్బర్‌లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న కాలువ

ప్రమాదకరంగా డ్రైనేజీ

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 6 : ఆదర్శనగర్ కాలనీ నుంచి వచ్చే మురుగు నీటి కాలువను శుభ్రం చేయడానికి ఉషోదయ కూడలి వద్ద తొలగించిన పలకను జీవీఎంసీ సిబ్బంది తొలగించి, అలానే వదిలేశారు. దాదాపు నెల రోజుల క్రితం దీన్ని తొలగించారు. అప్పటి నుంచి ప్రమాదకరంగా ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. పాదచారులు, వాహనదారులు కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి కాలువపై పలక వేయాలని స్థానికులు కోరుతున్నారు.

'సూపర్ సిక్స్'తో పేదలకు మేలు

ఆరిలోవ, ఏప్రిల్ 6 : చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వల్ల పేదలకు మేలు జరుగుతుందని 13వవార్డు టీడీపీ అధ్యక్షుడు పాత్రకొండ దర్మారావు అన్నారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆరిలోవలోని విష్ణుపురం, ప్రియదర్శిని కాలనీల్లో భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు యల్లమల్లి సురేష్, మజ్జి రమణి, వడిసెల శ్రీను, సోనాపూర్ సుధాకర్. కిల్లంపల్లి శ్రీను, గాంధీ, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది సంబరాలు

ఆరిలోవ, ఏప్రిల్ 6 : సమాజంలో ప్రజల హితం కోరుకొనేవాడు బ్రాహ్మణుడు అని ఉపకార సేవా సంస్థ చైర్మన్ కంచెర్ల అచ్చుతరావు అన్నారు. శనివారం ఆరిలోవ ప్రెస్‌క్లబ్ భవనంలో బాలభాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ దీవెన బ్రహ్మదీవెన అన్నారు. పంచాంగకర్త జ్యోతిష్య విశారద బ్రహ్మశ్రీ తెన్నేటి విశ్వనాథశర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులంతా సమస్యలపై సమష్టిగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పురోహిత సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వరశర్మ, కిషోర్ కుమార్ శర్మ, వెంకటేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రాభివృద్ధికి వైసీపీ అవసరం


యువతులతో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 6 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసీపీ మళ్లీ అధికారంలోకి రావాలని తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన 17వ వార్డులోని ఎంవీపీ కాలనీ, టీటీడీ కల్యాణ మండపం పరిసరాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటరు గేదెల లావణ్య, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్ర సమస్యల పట్ల అప్రమత్తం

ఆరిలోవ, ఏప్రిల్ 6 : మేనరిక వివాహాల వల్ల కొన్ని నేత్ర సమస్యలు వస్తాయని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వీరేంద్ర సచిదేవ్ అన్నారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. రక్త సంబంధీకుల మధ్య జరిగిన వివాహాల వల్ల పుట్టిన పిల్లలకు రెటీనా, కార్నియా లెన్స్ ఆప్టిక్ వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు.

సినిమా గైడ్

- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, శారద, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-1, హెవెన్, లక్ష్మీకాంత్ (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారెట్ 26, దొండకాయలు 18, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 155, బరబటి 22, ముల్లంగి 16,నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 28, దోస కాయలు 12, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22,బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 52, పొటల్స్ 50, కీరదోస 22, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	130
ఫారం ధర	--	150
విత్ స్కిన్	--	270
స్కిన్‌లెస్	--	280

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..


భీమిలి : సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు


మధురవాడ : గంటా సమక్షంలో టీడీపీ లో చేరిన నాయకులు

ప్రతి బూత్‌లోనూ మెజారిటీ కనిపించాలి

- భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు
- క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో సమావేశం

భీమునిపట్నం, ఏప్రిల్ 6 : ప్రతి పోలింగ్ బూత్ లోనూ టీడీపీ ఆధిక్యం ఉండేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా శ్రమించాలని భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆయన బీచ్ రోడ్‌లో వున్న పార్టీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో సుమారు 38 ఓట్ల ఆధిక్యతతో తనను గెలిపించారని గుర్తు చేశారు. అప్పుడు టీడీపీ ఒంటరిగా పోటీలో ఉందని, ఈసారి జనసేన, బీజేపీ కూడా కలిసి రావడంతో అంత కంటే ఎక్కువ మెజారిటీ రావాలని చెప్పారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలిపోకూడదన్న ఉద్దేశంతో పొత్తు పెట్టుకున్న విషయాన్ని కార్యకర్తలు గమనించాలని కోరారు. గతాన్ని దృష్టిలో పెట్టుకోవద్దని, ఏ కార్యకర్త అయినా తనను కలవాలంటే నేరుగా రావచ్చనని చెప్పారు. భీమిలి టీడీపీకి కంచుకోట అని మరోసారి నిరూపించాలని తెలిపారు. కార్యకర్తల ప్రచారం కంటే తాను వారి పనితనానికే ప్రాధాన్యమిస్తానని, మీ గ్రామాల్లో మీరేం చేస్తారు, నేనేమి చేయాలో ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. 9న భీమిలిలో మిత్రపక్షాలతో కలిసి సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

మాజీమంత్రి అప్పలనరసింహరాజు మాట్లాడుతూ గంటా గెలుపునకు అందరూ ఐక్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గంటా రవితేజ, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, మొల్లి హేమలత, పివి నరసింహం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు చిక్కాల విజయ్‌బాబు, దంతులూరి అప్పల నరసింహరాజు, పాసి నర్సింగరావు, యరబాల కృష్ణవేణి, కాళ్ల నగేష్‌కుమార్, గొల్లంగి ఆనంద్‌బాబు, కురిమిన లీలావతి, బోయి శ్రీను, పిట్లా సురేష్, కశిరెడ్డి దామోదరరావు పాల్గొన్నారు.

గంటా సమక్షంలో టీడీపీలో చేరికలు

మధురవాడ : భీమిలి టీడీపీ అభ్యర్థిగా గంటాను ప్రకటించిన తరువాత మధురవాడలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. గతంలో పార్టీని వీడిన వారు మళ్లీ సొంతగూటికి చేరుతున్నారు. మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు శనివారం గంటా సమక్షంలో పార్టీలో చేరారు.ఆయనతో పాటు మరికొందరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈనెల పది తరువాత గంటా ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు. ప్రచారంలో భాగంగా 5,6,7 వార్డులకు చెందిన పలువురు టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది.


ఎంవీపీ కాలనీలో ప్రచారం చేస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు

పేదల సంక్షేమమే ధ్యేయం : వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 6 : పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శనివారం ఆయన ఎంవీపీ కాలనీ 8, 12 సెక్టర్లలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ పాలనలో బీసీలకు రక్షణ ఉంటుందని, వారి సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని చెప్పారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.

ఏయూతో న్యూట్రికో సౌత్ ఏషియా ఎంఓయూ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 6 : ఏయూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు.శనివారం ఆయన ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో న్యూట్రికో సౌత్ ఏషియా సంస్థ ఎండీ డాక్టర్ సౌరభ్‌శేఖర్ నేతృత్వంలో ఆ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకోవడం, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పన, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఎంఎల్ఆర్ విభాగాధిపతి ఆచార్య కె. రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బూసి వెంకటస్వామికి అభినందనలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 6 : ఏయూ తెలుగు విభాగాచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి మద్రాస్ విశ్వవిద్యాలయ ఉగాది పురస్కారం అందుకున్న సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి శనివారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డాక్టర్ బూసి వెంకటస్వామి తెలుగు భాషా, సాహిత్యానికి చేస్తున్న సేవకు ప్రతిఫలంగా మద్రాస్ వర్సిటీ ఉగాది పురస్కారం ఇచ్చిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకుని వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

కొమ్మాది, ఏప్రిల్ 6 : బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ఐఎస్‌టీఎస్‌ఓ ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన 289 మంది విద్యార్థులు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ సందీప్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అమ్మవారికి పట్టుచీర సమర్పణ


అమ్మవారికి పట్టుచీర, సారె తీసుకువెళుతున్న పోతిన ప్రసాద్, తదితరులు

కొమ్మాది, ఏప్రిల్ 6 : పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీ నూకాంబికా జాతర సందర్భంగా అనూష కేటరింగ్ అధినేత పోతిన ప్రసాద్ కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేఎస్‌పీ చక్రవర్తి, పోతిన రాము, నగరాల రాష్ట్ర మాజీ చైర్మన్ పిళ్లా సుజాత, సత్యనారాయణ పాల్గొన్నారు.

నూకాలమ్మను దర్శించుకున్న గంటా

కొమ్మాదిలోని సేవానగర్‌లో జరుగుతున్న నూకాలమ్మ జాతర పురస్కరించుకుని మాజీ మంత్రి, భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గంటా రవితేజ, ప్రముఖ వ్యాపారవేత్త తలశిల విజయ్‌మోహన్, టీడీపీ వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్, జానకిరామ్, భరత్ పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాలమ్మ ఉత్సవాలు

భీమునిపట్నం, ఏప్రిల్ 6 : భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాలు ఆదివారం నుంచి జరగనున్నాయి. ఈమేరకు దేవదాయ శాఖాధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం రాత్రి 11 గంటలకు తొలేళ్ల ఉత్సవం, సోమవారం సాయంత్రం అనుపోత్సవం జరుగుతాయి. కాగా ఉత్సవం నిర్వహణ ఏర్పాట్లను సీఐ రమేష్, ఎస్ఐ హరీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు వారు పలు సూచనలు చేశారు.

అక్రమ భవన నిర్మాణం కూల్చివేత

పెదవాల్తేరు, ఏప్రిల్ 6 : జీవీఎంసీ 17వ వార్డు పెదవాల్తేరులోని శెట్టి బలిజ వీధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తు భవన నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. నిర్మాణదారుడు గొంగల శ్రీనివాస్ పది అడుగుల రోడ్డులో జీ+4 భవనాన్ని నిర్మించడంపై కొన్ని రోజులుగా విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై కొందరు స్థానికులు టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోలేదు. దీని వెనుక వైసీపీ నాయకుల ఒత్తిడి ఉన్నట్టు తెలిసింది. అలాగే టౌన్ ప్లానింగ్ అధికారులకు కూడా పెద్ద ఎత్తున ముడుపులు అందినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానికుడు రంగాల శివ భాస్కర్ జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం ముదిరింది. స్థానికులకు ఇబ్బంది కలిగేలా కేవలం పది అడుగులు కూడా లేని రోడ్డులో 250 చదరపు గజాల్లో బహుళ అంతస్తు భవన నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. శ్రీనివాస్ భవన నిర్మాణంతో పాటు ఇదే తరహాలో నిర్మిస్తున్న పలు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నారు.


నగరంలోని పార్టీ కార్యాలయం వద్ద జరిగిన నాయకులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

భీమునిపట్నం, ఏప్రిల్ 6 : పట్టణంలోని గాడువీధిలో వున్న బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు ఎగురవేసారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసుపల్లి శ్రీహరి, 3వ డివిజన్ అధ్యక్షురాలు కంటుభుక్త సునీత, నాయకులు పాలుబోతు విజయ, ఊళ్ల కొండబాబు, గొట్టుపల్లి అప్పారావు, మహంతి అప్పల రమణ, పాల్గొన్నారు.

పెదవాల్తేరు : నగరంలోని బీజేపీ కార్యాలయంలోనూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎస్. విజయనందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జె. దామోదర్ యాదవ్, పొలిమెర శ్రీనివాసరావు, శ్రీరంగం ధనేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత్,ఎన్. గజపతిరావు, వల్లూరి మోహన్‌రావు, మురళీ మోహన్ రాజు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తా : బొత్స ఝాన్సీ


మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ

సింహాచలం, ఏప్రిల్ 6 : తనను ఎంపీగా గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తానని వైసీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. ఆడివివరం పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి సారథ్యంలో స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో శనివారం జరిగిన కాపు సామాజికవర్గ బంధుమిత్రుల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి, నాయకులు ఎర్ర వరంబాబు, లంక మోహన్‌రావు, తోట రాజీవ్, కర్రి సత్తిబాబు, లోగీశ గణేష్ పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : ముఖ్యమంత్రి జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీ పిలుపునిచ్చారు. 9వ వార్డు రామాలయం వీధిలో జరిగిన ప్రచార సభలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ స్వాతిదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరం

సింహాచలం, ఏప్రిల్ 6 : ప్రజలకు ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన అవసరమని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. బుచ్చిరాజు అన్నారు. శనివారం సింహాచల గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో సామాజిక ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూఎన్ఓ ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నా ఆరోగ్యం-నా హక్కు' అన్న నినాదాన్ని ఇచ్చిందన్నారు. దీనిపై ప్రజలందరూ పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక వైద్య విభాగం ఆచార్యులు కృష్ణవేణి, డిప్యూటీ సివిల్ సర్జన్లు ప్రసాద్ నాయక్, రామరెడ్డి, రాధ, శ్రీనివాస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు : సీఐ


యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ గోవిందరావు

ఆరిలోవ, ఏప్రిల్ 6 : చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆరిలోవ సీఐ గోవిందరావు హెచ్చరించారు. శనివారం ఆయన ఆదర్శ నగర్, రవీంద్ర నగర్ ప్రాంతాల్లో యువతకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అల్లర్లు చేయకూడదన్నారు.ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.

సంగివలసలో రక్తదాన శిబిరం


తగరపువలస, ఏప్రిల్ 6 : సంగివలస ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల ఆవరణలో వైద్య విద్యార్థులు శనివారం ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని అఖిల భారత సర్జన్ల సంఘం పిలుపుమేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ సిబ్బంది 80 మంది నుంచి రక్తం సేకరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డా. సుధాకర్, బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి శర్మ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డా. శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపునకు యత్నం

విశాలాక్షినగర్, ఏప్రిల్ 6 : జీవీఎంసీ 9వ వార్డు తెన్నేటీ పార్కు ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించేందుకు వీఎంఆర్డీయే రెవెన్యూ విభాగం అధికారులు శనివారం ప్రయత్నించారు. దీంతో దుకాణదారులకు, వీఎంఆర్డీయే అధికారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వీఎంఆర్డీయే రెవెన్యూ విభాగం ఏవో వెంకటేశ్వరరావు, ఆర్ఐ భానుమూర్తి తెలిపిన వివరాలు ప్రకారం.. పార్కింగ్ స్థలంలో వీఎంఆర్డీయే వేసిన వేలంలో తిరుమలరాణి అనే మహిళ దుకాణం ఏర్పాటుకు లీజు పొందారు. ఆమె కొన్ని నెలలు పాటు దుకాణాన్ని కొనసాగించిన అనంతరం శారదాదేవి అనే వేరే మహిళకు లీజుకి ఇచ్చారు. ఈ విషయం తెలిసిన అధికారులు మూడు నెలలు క్రితం తిరుమలరాణికి నోటీసులు పంపించారు. నోటీసులు అందుకున్న ఆమె దుకాణాన్ని తొలగిస్తామని చెప్పి కాలయాపన చేయడంతో సంబంధిత అధికారులు శనివారం దుకాణాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో కంటైనర్‌లో ఉన్న మరో మహిళ దుకాణం తొలగించవద్దంటూ అడ్డుపడడమే కాకుండా సిబ్బందిపై తిరగబడడం, కిరోసిన్ పోసుకుని చనిపోతానంటూ బెదిరించడంతో అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసుల సమక్షంలో అధికారులు కంటైనర్‌లో ఉన్న వస్తువులను బయటికి తీశారు. త్వరలోనే అక్కడ నుంచి కంటైనర్‌ను తొలగించడంతో పాటు పార్కింగ్ స్థలంలో ఉన్న దుకాణాలను తొలగిస్తామని అధికారులు చెప్పారు.

ఆ వలంటీర్లపై చర్యలు తీసుకోండి

- కలెక్టరుకు ఎమ్మెల్యే వెలగపూడి ఫిర్యాదు


ఫిర్యాదు కాపీ చూపిస్తున్న ఎమ్మెల్యే

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 6 : వైసీపీ సమావేశంలో పాల్గొన్న 14 మంది వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు మల్లికార్జునను కోరారు. శనివారం ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.గత నెల 30న సీతమ్మధార రాధాకృష్ణ ఫంక్షన్ హాలులో నిర్వహించిన వైసీపీ సమావేశంలో 14 మంది వలంటీర్లు పాల్గొన్నట్టు పత్రికల్లో వచ్చిన కథనం ప్రస్తావించారు. తాము గుర్తించిన ఆళ్ల ఉష, కోన చరణ్, బొట్టా సాయి రూప, అమర తవిటి రాజు, బుద్దాల నరేష్, సారిపల్లి రాజేష్, సారిపల్లి వంశీ, చెరుకూరి అలేఖ్య, గిడిజాల కల్యాణి, గొర్లె గీత, మద్దాల సుజి గాయత్రి, రంజిని, పద్మిని, స్వర్ణ పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు అనుసరించి వలంటీర్లు ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడానికి వీల్లేదని, కానీ వారు నిబంధనలు అతిక్రమించినందున తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, ఏప్రిల్ 6 : వరాహలక్ష్మీనృసింహస్వామికి శనివారం పలు ఆర్జిత సేవలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చకులు పూజలు చేశారు. తరువాత గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి భక్తుల గోత్రనామాలతో స్వామికి అష్టోత్తర శతనామార్చన జరిపారు. మంగళవాయిద్యాల నడుమ గరుడ వాహనం చుట్టూ భక్తులు ముమ్మారు ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి వారికి పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించి, భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఆలయాల్లో శనిత్రయోదశి పూజలు

సింహాచలం, ఏప్రిల్ 6 : సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరాలయం, కొండ దిగువ పాత అడివివరంలో, విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు శనివారం శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. వేకువజాము నుండే అటు పరమేశ్వరుని, ఆలయ ఆవరణల్లోని గ్రహాలను దర్శించుకున్నారు. శనిత్రయోదశి కావడంతో అటు సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతక స్వామి ఆలయానికి, ఇటు సింహాద్రినాథుని దర్శనానికి భక్తుల తాకిడి నెలకొంది.

అప్పన్న చందన సమర్పణకు రూ.లక్ష విరాళం

సింహాచలం, ఏప్రిల్ 6 : సింహగిరిపై మే 10న జరిగే వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవాన్ని పురస్కరించుకుని చందన సమర్పణకు సింహాచలం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో శనివారం దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాసమూర్తికి అందజేశారు. ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్, ఏఈఓ నక్క ఆనందకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 6 : ఏయూ జియోఫిజిక్స్ విభాగం విద్యార్థులకు ఓఎన్జీసీ విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్. చంద్రబాబు ఉపకార వేతనాలు అందించడానికి ముందుకు వచ్చారు. ఈమేరకు శనివారం ఆయన విద్యార్థులకు రూ. 16 వేలు ఉపకార వేతనాలు అందించారు. ప్రతినెల విభాగంలో అవసరమైన విద్యార్థులకు రూ.3 వేలు ఉపకార వేతనంగా అందించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడానికి వచ్చిన చంద్రబాబును వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.వి. నాయుడు, విభాగాచార్యులు పి.త్రినాథరావు, ఎం. జగన్నాథరావు, ఆచార్య శ్రీనివాసరావు, ప్రకాష్, ఆనంద్ పాల్గొన్నారు.